మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A4284
www.manananationalistvoice.com
epaper.manananationalistvoice.com



రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు



ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 181 | 29 శుక్రవారం, మే 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం




# ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

## - కావాలనే యాగీచేస్తున్న పలువురు నేతలు

## - ధాన్యం కొరుగోళ్లు సజావుగా సాగుతున్నాయన్న ఉత్తమ్

**హైదరాబాద్,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**

తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో 75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. వివరాలు 2లో

# ఉక్రెయిన్‌తో ఎడతెగని రష్యా యుద్ధం

## - భారీగా సైనిక సంపదను కోల్పోయిన రష్యా

## - 5లక్షల మంది సైన్యం మరణించినట్లు వార్తలు

**మాస్కో,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**

రష్యా-ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతోన్న యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వివరాలు 2లో



# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## - చివరి ధాన్యం గింజవరకు కొంటాం

## - మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి

**మంచిర్యాల,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**

తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. చివరి ధాన్యం గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామని పేర్కొన్నారు. గురువారం చెన్నూరు మండలం బావురావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు. వివరాలు 2లో

# ఎన్టీఆర్ అంటే పేదలకు భరోసా.. రైతుకు నేస్తం



## - ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలి- యువతను రాజకీయాల్లో ప్రోత్సహించిన మహోన్నతుడు

## - మహానాడు తీర్మానంలో చంద్రబాబు డిమాండ్

**అమరావతి,మే 28 (నేషనలిస్ట్ వాయిస్)**

మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు తెలుగుజాతి సెంటిమెంట్ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని అడుగుతానని పేర్కొన్నారు. వివరాలు 2లో

# పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం

## - కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై

## - మోడీ సమీక్ష



**న్యూఢిల్లీ,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**

అంతర్రాష్ట్ర జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలన్నారు. ఈ విషయంలో కెన్-బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలని చెప్పారు. కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష నిర్వహించారు. వివరాలు 2లో

# పూర్తి కావచ్చిన కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్

## - ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ఇక్కడే: అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**

కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని చెప్పారు.కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై అశ్వినీ వైష్ణవ్ కీలక సమీక్ష నిర్వహించారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేస్తుందన్నారు. వీటిని దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు రైల్వే మంత్రి తెలిపారు.

# ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా

## - ఎఫ్‌సిఐ ద్వారా ఎందుకు కొనరో చెప్పాలి

## - బిజెపి నేతలపై మండిపడ్డ మంత్రి అడ్లూరి

**జగిత్యాల,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**



ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వివరాలు 2లో

# తెలంగాణకు చల్లని కబురు

## - రెండురోజుల్లో రుతుపవనాల ఆగమనం

**హైదరాబాద్,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**

తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది.

# సిద్ధరామయ్యకు డికె పాదాభివందనం

## - బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో ఘటన

**బెంగళూరు,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**



కర్నాటక కాంగ్రెస్‌లో మార్పు అనివార్య మయ్యింది. సిద్ధరామయ్య తన సీఎం పదవి నుంచి తప్పుకునేందుకు సిద్ధమ య్యారు. ఈ క్రమంలో బెంగుళూరులో ఆసక్తికర ఘటన చోటుచేసు కున్నది. సీఎం సిద్ధరామయ్యను ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సమయంలో ఈ ఘటన జరిగింది. గనం చేసుకున్న డిప్యూటీ సీఎం శివకుమార్ ఆ తర్వాత పాదాభివందనం చేశారు. వివరాలు 2లో

# పొంగులేటి సవావల్‌పై కెటిఆర్ ప్రతిసవాల్

**హైదరాబాద్,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**





సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పం దించారు.

# ఎన్టీఆర్‌కు ప్రధాని మోడీ నివాళి

**న్యూఢిల్లీ,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**

మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని ఓ పోస్టు పెట్టారు. 'మహనీయులు ఎన్టీఆర్ గారి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు. పేదలకు, అణగారిన వర్గాలకు గౌరవాన్ని కల్పించే దిశగా ప్రజా సంక్షేమం, సుపరిపాలన పట్ల ఆయనకున్న అంకితభావం నేటికీ ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచి ఉంది. వివరాలు 2లో





# దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

## - నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు

## - భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం

## - మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబుల వెల్లడి

**హైదరాబాద్,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. వివరాలు 2లో

# ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా

మొదటిపేజీ తరువాయి

గురువారం జగిత్యాల జిల్లాలో మంత్రి అడ్లూరి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాలు పేరుతో దోచుకుంటున్నామని బీజేపీ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భద్రాద్రి రాముడి ఆలయం ముందు మాట్లాడాలని మంత్రి అడ్లూరి సవాల్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం సరిగా లేకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేద్దామని అన్నారని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురావడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి బీజేపీ ఎంపీలు నిధులను తీసుకురావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ చేశారు. ఇదిలావుంటే ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బక్రీద్ సందర్భంగా ధర్మపురిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అదేవిధంగా ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగ యువతీయువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్ పూర్తయిన యువతీయువకులకు స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల రుణాలు బ్యాంకు ద్వారా ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# ఎన్టీఆర్ అంటే పేదలకు భరోసా.. రైతుకు నేస్తం

మొదటిపేజీ తరువాయి

గురువారం రెండోరోజు మంగళగిరిలో జరుగుతున్న మహానాడు వేడుకలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, టీడీపీ సీనియర్ నేతలు, మంత్రులు నివాళులు అర్పించారు. 1,875 క్లస్టర్ల నుంచి మహానాడుకు టీడీపీ నేతలు, శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మహానాడులో ఆయనకు నివాళి అర్పించే తీర్మానంపై సీఎం ప్రసంగించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మహానాడులో ప్రతిపాదించారు. దేశ అత్యున్నత పౌర పురస్కారంతో ఎన్టీఆర్‌ను సత్కరించాలని సీఎం చంద్రబాబు కోరారు. ని చెప్పుకొచ్చారు. ఎన్టీఆర్ పాలన రైతులకు అండ, మహిళలకు భరోసా, కార్మికులకు అభయం.. యువతకు దిక్సూచి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 1983లో రాజకీయాల్లో యువతకు ఎన్టీఆర్ అవకాశాలు కల్పించారని ప్రస్తావించారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని.. భవిష్యత్తులో సమర్థ నాయకత్వం ఉండేలా భవిష్యత్తు కార్యాచరణ చేపడుతున్నామని అన్నారు. నిన్నటి మహానాడులో జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు లోకేశ్ ప్రతిపాదించిన 33 శాతం రిజర్వేషన్‌ను మనమే ప్రారంభిద్దామని తెలిపారు. 33 శాతం రిజర్వేషన్లను మహిళలకు కల్పించాలని కేంద్రాన్ని మరోమారు కోరదామని అన్నారు. తెలుగు వెలుగుగా నిలిచిన స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనేది మన అందరి డిమాండ్ అని చెప్పారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోయారని ఉద్ఘాటించారు. సామాన్యుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించారన్నారు. తెలుగు ప్రజల ఐక్యత కోసం పనిచేసిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని ఉద్ఘాటించారు. భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు విశిష్టం, అపూర్వమని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల మనోభావాలను గుర్తించి ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవంగా తీర్మానిస్తోందని తెలిపారు. ఇది మనందరి ఆకాంక్ష, ప్రతీ తెలుగువారి కోరిక అని చెప్పారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడికి భారతరత్న ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరారు.ఎన్టీఆర్ అంటే అన్నివర్గాలు ప్రేమించే నాయకుడని ప్రశంసించారు. సాధారణ ఉద్యోగిగా మొదలై, సినిమా స్టార్‌గా ఎదిగి, ప్రజల కోసం పార్టీ పెట్టి సీఎంగా ఎదగడం ఎన్టీఆర్‌కే సాధ్యమని కీర్తించారు. ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని ఎన్టీఆర్ ఎప్పుడూ వీడలేదని తెలిపారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అనేదే ఎన్టీఆర్ సిద్ధాంతమని పేర్కొన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ జయంతి తెలుగువారందరికీ పండుగ రోజు అని తెలిపారు. సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి సినీ జీవితంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఎదిగారని ప్రశంసించారు. ఎన్టీఆర్ మళ్లీ పుడితే తప్ప ఆయన క్రమశిక్షణ, ఆయన ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదని అన్నారు. ఆయన ఎక్కడ ఉన్నా తెలుగువారి ఆత్మగౌరవం కోసమే జీవించారని తెలిపారు. రైతుబిడ్డ నుంచి సినిమాల్లో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రల వరకూ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారని ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ పేరు తలుచుకుంటేనే పట్టుదల, ఆత్మవిశ్వాసం వస్తుందని చెప్పారు. ఆయన పేరు తలచుకుని సంకల్పం చేస్తే చాలు దానికి తిరుగు ఉండదన్నారు. దేశ రాజకీయాల్లో ఆయన లాంటి నాయకుడు మరొకరు లేరని.. ఆయన మొదట సబ్‌రిజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరారని ప్రస్తావించారు. నీతి నిజాయితీతో ఆయన సినిమాల్లోకి వచ్చారని.. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారని వ్యాఖ్యానించారు. ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిందని.. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిందని సీఎం చంద్రబాబు తెలిపారు.

# తమిళ రాజకీయాల్లో విజయ్ ఎత్తులు !

తమిళనాడు రాజకీయాలు రసవత్తర మలుపులు తిరుగుతున్నాయి. మద్దతుల ఇచ్చిన అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు మళ్లీ పళనిస్వామి చెంతకు చేరారు. మేమంతా మీ వెంటే అని ప్రకటించారు. ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం మనలేదని డిఎంకె నేత స్టాలిన్ ఇప్పటికే శాపనార్థాలు పెట్టారు. ఈ స్థితిలో కాంగ్రెస, లెఫ్, ముస్లిం పార్టీల మద్దతు బొటాబొటిగా ఉంది. దీంతో మరో ఐదేళ్లపాటు లాక్కురావడం అంత సులభం కాదు. ఎందుకంటే ఐదారు సీట్ల మద్దతుతో వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సిఎం విజయ్‌కు తలనొప్పిగా పరిణమించవచ్చు. ఈ క్రమంలో సొంతగా బలం కోసం టివికె అధినేత, సిఎం కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ పార్టీలకు చెక్ పెట్టడంతో పాటు తమిళనాట పాతుకు పోయేందుకు రాజకీయంగా ఎత్తులు వేస్తున్నట్లు పరిస్థితులు తెలియచేస్తున్నాయి. చిల్లర పార్టీలతో కలిసి నడిచేకంటే సొంతగా బలం సమకూర్చుకోవడం ఉత్తమమని ఆయన భావనలో ఉన్నారు. అందుకే ఇటీవల అన్నాడిఎంకెకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పంచన చేరారు. వారు ఉప ఎన్నికల్లో టివికె పార్టీ పక్షాన గెలిస్తే సొంతబలం పెరగవచ్చు. ఇలా సొంత బలం కోసం అవసరమైన ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలన్న ఎత్తుగడలో సిఎం విజయ ఉన్నట్లు సమాచారం. ఓవైపు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకోవడంతో పాటు, పార్టీ బలాన్ని పెంచుకునేలా టివికె చీఫ్ ఎత్తుడగులు సాగుతున్నాయి. అధికారంలో ఉంది మన ప్రభుత్వమే అని డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ పార్టీ కార్యకర్తలతో అన్నట్లు విస్తృత ప్రచారంలో ఉంది. మరో సందర్భంలో విజయ్ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఆయనే వెల్లడించారు. ఈ మాటల్ని అనుసరించి.. టీవీకే ప్రభుత్వాన్ని తాను నియంత్రించేస్థాయిలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది టీవీకేకు మింగుడు పడటంలేదు. మరోవైపు అన్నాడీఎంకే చీలికల కారణంగా మద్దతుగా నిలిచిన 25 మందిలో కొందరు మంత్రి పదవుల్ని ఆశించినట్లు ప్రచారంలో ఉంది. మంత్రివర్గ విస్తరణలో వారికెలాంటి స్థానం లేకపోవడం, కాంగ్రెస్ లో ఇద్దరికి దక్కడంతో పాటు డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, వీసీకేకు చెరొక మంత్రిపదవి ఇవ్వడంతో అన్నాడీఎంకే చీలిక శ్రేణులు అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. డీఎంకే అధిపత్యం తగ్గించే వ్యూహంలో.. అన్నాడీఎంకే చీలిక ఎమ్మెల్యేలు తమవైపు ఉండటాన్ని లాభంగా మలచుకోవాలని టీవీకే చూస్తోంది. తమ పార్టీలోకి రావాలంటే రాజీనామాలు చేయాలనే షరతు విధించినట్లు విశ్వసనీయంగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే నలుగురు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. రాజీనామాలు చేసేందుకు మరికొందరు అన్నాడీఎంకే చీలికవర్గం ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టీవీకేకు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో.. ఆ పార్టీకి మద్దతిచ్చే పక్రియలో రెండు ప్రధాన కూటములు ఎవరి ఆట వారు ఆడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు విజయ్ కొత్త ఆట మొదలుపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి విజిల్ గుర్తుపై బరిలోకి పంపి.. వారిని గెలిపించి.. ఇతర పార్టీల మద్దతు లేని సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన బల ప్రదర్శనలో టీవీకే ప్రభుత్వం అనూహ్య మద్దతు కూడగట్టుకుంది. ఏకంగా 144 ఎమ్మెల్యేల బలాన్ని అందుకుంది. ఈ సంఖ్యలోనే అనేక వ్యూహాలు కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీవీకేపై ఆధిపత్యం కోసం ఇటు డీఎంకే కూటమి, అటు అన్నాడీఎంకే ఓ వర్గం అంతర్గత వ్యూహాల్ని రచించినట్లు తెలుస్తోందంటున్నారు. అంతర్గత నిర్ణయాల కారణంగా తమ కూటమిలోని వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 8 సీట్లను టీవీకే మద్దతుగా ఇచ్చారు. మరోవైపు టీవీకేతో జట్టుకట్టిన కాంగ్రెస్‌కు 5 సీట్లు, ఏఎంఎంకే నుంచి బయటికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా మద్దతిచ్చిన కామరాజ్ ఓటు కలిపి.. టీవీకేకు 119 సీట్ల వచ్చింది. కోర్టు ఆంక్షలతో తిరపత్తూర్ ఎమ్మెల్యే ఓటింగ్‌కు పాల్గొనలేదు, తిరుచ్చి తూర్పుస్థానం ఖాళీగా ఉండటం, స్పీకర్ ఓటు లెక్కలోకి లేకపోవడంతో టీవీకే బలం 105గా ఉంది. ఇతరుల మద్దతుతో ఓటింగ్‌కు ముందే మ్యాజిక్ ఫిగర్ దాటినట్లు అంచనాలు వచ్చాయి. ఇక అసెంబ్లీలో ఓటింగ్ జరుగుతున్న క్రమంలో అన్నాడీఎంకే చీలికవర్గం నుంచి అనూహ్యంగా మరో 25 ఓట్లు దక్కాయి. దీంతో బలం 144కు చేరింది. రెండు కూటముల నుంచి టీవీకేకు బలం అందడంతో వచ్చే 6నెలలదాకా ప్రభుత్వం కూలడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిన్లట్లైంది. మద్దతు పార్టీల సంగతి అటుంచితే.. ఇప్పటికిప్పుడు టీవీకే నెమ్మదిగా బలపడుతోంది. సొంతంగా 107 స్థానాలు దగ్గరున్నాయి. 5 కాంగ్రెస్, ఒక స్వతంత్రతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 5 అసెంబ్లీ స్థానాల్లో గెలిస్తే.. 118 స్థానాల బలమొస్తుంది. అన్నాడీఎంకే చీలిక వర్గంలోని మరికొందరు రాజీనామాలకు సిద్ధపడి టీవీకే గుర్తుపై పోటీ చేసే అవకాశమొస్తే మ్యాజిక్ ఫిగర్ 118ని దాటి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది. తిరుచ్చి ఈస్ట్‌లో విజయ్‌కు 91,381 ఓట్లు వచ్చాయి. ఈయన డీఎంకేపై 27,416 ఓట్లతో గెలిచారు. ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గ బలం తోడైతే అవలీలగా లక్ష ఓట్లు దాటొచ్చనేది అంచనా. రాజీనామాలు చేసిన స్థానాల్లో.. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం(ఎస్సీ), తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం కలుపుకుని ఇప్పుడు తొలి 3 స్థానాల పార్టీలు టీవీకేవైపు ఉండటంతో ఇక్కడ లక్షన్నర ఓట్లకు తగ్గని బలముంది. 4 రాజీనామా స్థానాల్లో తిరిగి టీవీకే అభ్యర్థి గెలిచే అవకాశాలు సమృద్ధిగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

# దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

మొదటిపేజీ తరువాయి

విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ పనులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ పనులపై మార్గనిర్దేశర చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆధునిక మౌలిక వసతులతో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికి తలమానికంగా నిలవడం ఖాయమని మంత్రులు స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ ప్రతిపక్షాలు రాజకీయ లబ్ది కోసం ధాన్యం కొనుగోళ్లపై రాద్దాంతం చేస్తున్నాయని విమర్శించారు. కొనుగోలు పక్రియను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇకపోతే అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని కొని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడిన పరిస్థితులపై మంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించామని అన్నారు. అకాల వర్షాలకు తడిసిన 9,214 టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నష్టం కలిగించే ఎటువంటి చర్యలనూ ప్రభుత్వం ఉపేక్షించబోదని అన్నారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు 66.75 లక్షల టన్నుల ధాన్యం చేరగా, అందులో 57 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులకు ఇప్పటివరకు రూ.10,097 కోట్ల చెల్లింపులు జరిగాయని, దీని ద్వారా 8.15 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. కొనుగోలు చేసిన 57 లక్షల టన్నుల ధాన్యంలో 44.67 లక్షల టన్నులు దొడ్డు రకాల ధాన్యం కాగా, 12.33 లక్షల టన్నులు సన్న రకాల ధాన్యం అని మంత్రి పేర్కొన్నారు. ధాన్యాన్ని మిల్లులకు వేగంగా తరలించేందుకు ఇసుక సరఫరా చేసే లారీలను కొనుగోలు కేంద్రాలకు మళ్లించినట్లు తెలిపారు.

# సిద్ధరామయ్యకు డికె పాదాభివందనం

మొదటిపేజీ తరువాయి

ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సమయంలో ఈ ఘటన జరిగింది. గురువారం రాష్ట్ర గవర్నర్ థావర్‌చాంద్ గెహ్లాట్ అపాయింట్‌మెంట్ సిద్ధరామయ్య తీసుకున్నారు. ఉదయం తన క్యాబినెట్ మిత్రులకు సీఎం సిద్ధరామయ్య అల్పాహార విందు ఏర్పాటు చేశారు. తన అధికార నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో పాటు ఆయన క్యాబినెట్ మిత్రులు కూడా బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కు హాజరయ్యారు. శివకుమార్‌ను సీఎం సిద్ధరామయ్య హత్తుకున్న ఫోటోను సీఎంవో ఆఫీసు రిలీజ్ చేసింది. ఇక తర్వాత సిద్ధరామయ్య పాదాలను శివకుమార్ తాకారు. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఆదేశాల ప్రకారమే సీఎం సిద్ధరామయ్య తన పదవి నుంచి తప్పుకున్నారు.

# పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టుల అమలులో జాప్యం.. ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని రాష్ట్రాలకు మోదీ సూచించారు. 'స్వచ్ఛభారత్ మిషన్–అర్బన్ 2.0'ను కూడా సమీక్షించారు. నగరాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. కాల్వల వెంబడి, కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలనూ అన్వేషించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

# ఉక్రెయిన్‌తో ఎడతెగని రష్యా యుద్ధం

మొదటిపేజీ తరువాయి

2022 నుంచి జరుగుతోన్న ఈ ఘర్షణల్లో రష్యాకు సైనిక పరంగా భారీ నష్టం వాటిల్లినట్లు కనిపిస్తోంది. ఈ పోరులో 5 లక్షల మంది మాస్కో సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనావేశాయి.మరోవైపు, యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి తాము 55వేలమంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ఫిబ్రవరిలో వెల్లడించారు. ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నా.. రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశలవారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్నవారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం.. యుద్ధరంగంలో భారీగా ప్రాణనష్టానికి దారితీస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, అమెరికా, దాని మిత్రదేశాలు సరఫరా చేసే క్షిపణి వ్యవస్థలు, ఫిరంగి, అధునాతన డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగిస్తోంది. కమాండ్ పోస్టులు, సైనిక సమూహాలు లక్ష్యంగా జెలెన్‌స్కీ సైన్యం దాడులు చేస్తోంది. దాంతో ఈ నష్టం మరింత పెరిగిందనే అంచనాలున్నాయి. ఈ దాడులను ఎదుర్కొనేలా రష్యా సుశిక్షితులైన సైనికులను నియమించుకోలేక పోతుందని, విధుల్లో ఉన్నవారిని కాపాడుకునేలా ఎలాంటి రక్షణకవచాలను సమీకరించలేకపోతుందని యూకే నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ కారణాలే రష్యాను దెబ్బతీస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు రష్యా ప్రభుత్వం వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకునే వారికి, వారి కుటుంబాలకు ఉండే రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.33కోట్లు) వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు వార్తలు వచ్చాయి.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చిందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల పక్రియ కొనసాగుతుందని వివరించారు. పెద్దపల్లిలో మూడు గోడౌన్స్ అలాట్‌మెంట్ చేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. హామాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. సింగరేణి నుంచి 40 లారీలు, మైనింగ్ శాఖ నుంచి 40 లారీలను కేటాయించామని అన్నారు. మొత్తం 80 లారీలతో త్వరలోనే రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొని మిల్లులకు తరలిస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

# ఏర్గట్లలో ఘనంగా బక్రీద్ వేడుకలు

**ఏర్గట్ల, మే 28, (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి)**

ఏర్గట్ల మండల కేంద్రంలో ముస్లిం సోదరులు బక్రీద్ (ఈద్–ఉల్–అజ్హా) పండుగను గురువారం ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని మండలంలోని మసీదులు, ఈద్గాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించిన ముస్లింలు సమీపంలోని ఈద్గాలకు, మసీదులకు చేరుకుని ప్రత్యేక సామూహిక ప్రార్థనలు (నమాజ్) నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు బక్రీద్ ప్రాముఖ్యతను, ప్రవక్త ఇబ్రహీం చేసిన త్యాగాన్ని భక్తులకు వివరించారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు 'ఈద్ ముబారక్' చెప్పుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. పండుగ సందర్భంగా పేదలకు, ఆశ్రితులకు దానధర్మాలు చేయడం, విందులు ఆరగిస్తూ బంధుమిత్రులతో ఆనందంగా గడపడం ఈ పండుగ ప్రత్యేకతగా నిలిచింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లింల ఇళ్లలో ప్రత్యేక వంటకాలతో సందడి నెలకొంది.



# ఏర్గట్లలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

**ఏర్గట్ల, మే 28, నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి**

ఎర్గట్ల : మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద విద్యుత్ లో–వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు కొత్తగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ నూతన ట్రాన్స్ ఫార్మర్ ను సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానికుల ఇబ్బందులను గుర్తించి విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సున్నపు లక్ష్మి శ్రీనివాస్, లైన్మెన్ గణపతి, ఏఎల్ఎం నవీన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

**-పాల్వంచలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు**

**ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పలువురు నేతలు**

**భద్రాద్రి కొత్తగూడెం,మే28(నేషనలిస్ట్ వాయిస్):**

తెలుగు జాతి ముద్దుబిడ్డ నటసార్వభౌముడు మహానేత నందమూరి తారకరామారావు సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లెల రవిచంద్ర ఆధ్వర్యంలో పాల్వంచ పోస్టాఫీస్ సెంటర్‌లో గురువారం దివంగత ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు కార్యకర్తలు అభిమానులుఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నటుడిగా తెలుగు సినీ పరిశ్రమకు రాజకీయ నాయకుడిగా ప్రజా సేవకు ముఖ్య మంత్రిగా పేద ప్రజల సంక్షేమానికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేసిన అన్న ఎన్టీఆర్.. మహిళల అభివృద్ధికి ఎంతో కృషి చేయడంతో పాటు సంక్షేమానికి పెద్ద పీట వేసిన అన్న ఎన్టీఆర్ అని పాల్వంచ 37వ డివిజన్ కార్పొరేటర్ మల్లెల స్వప్నకుమారి అన్నారు. అన్న ఎన్టీఆర్ మహిళలకు అండగా నిలబడ్డ మహానుభావుడని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల రూపశిల్పి తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక అని ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో మాగులూరి మల్లికార్జున్, బోయపాటి శ్రీనివాసరావు, దారా కరుణాకర్, మాగులూరి కృష్ణ, కాలే పూలయ్య, కోపరపు వీరబాబు, సంగులోత్ రంజిత్, అంకిరెడ్డి వీరస్వామి, చిప్ప సత్యం, నగేష్, చంద్రగిరి రవి, చిప్ప చిన్న సత్యం, నారకట్ల రాజశేఖర్, జెట్టి శ్రీకాంత్, భవాని, బత్తుల మాదవి, విజయలక్ష్మి, కమల, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# వర్షాలు, గాలిదుమారానికి విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది

**-తూప్రాన్ మండలంలో 25 విద్యుత్ స్తంభాలు, 4 ట్రాన్స్‌ఫార్మర్లు కూలిన ఘటన-పునరుద్ధరించిన విద్యుత శాఖ**





**తూప్రాన్, మే 28. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తూప్రాన్ మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నది. ముఖ్యంగా 33 కేవీ మాసాయిపేట ఫీడర్ పరిధిలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండల వ్యాప్తంగా సుమారు 25 విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు కూడా దెబ్బతిన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సమస్య తీవ్రతను గుర్తించిన విద్యుత్ శాఖ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి, దెబ్బతిన్న ప్రాంతాల్లో కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ వెంకటేశ్వర్లు వెల్లడించారు. 33 కేవీ మాసాయిపేట ఫీడర్‌కు సంబంధించిన డ్యామేజ్ పోల్స్ రెక్టిఫికేషన్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని, మిగిలిన ప్రాంతాల్లో కూడా త్వరితగతిన విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని తెలిపారు. వర్షాలు, గాలిదుమారంలోనూ విద్యుత్ సిబ్బంది నిరంతరం శ్రమించి సేవలు అందిస్తున్నారని స్థానికులు అభినందించారు.

# సోదరభావానికి ప్రతీకగా బక్రీద్ పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి

**పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) మే 28**

పరిగి పట్టణంలో జరిగిన బక్రీద్ వేడుకల్లో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం సోదరులను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... బక్రీద్ పండుగ ముస్లిం సోదరులకు ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. ఖురాన్ బోధించిన మార్గంలో పేద ప్రజలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. సమాజంలో ప్రేమ, సోదరభావం, సేవా దృక్పథం పెంపొందాలని ఆకాంక్షించారు.



# అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణ పనులను పర్యవేక్షించిన పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి

**పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) మే 28**

పరిగి పట్టణంలోని అయ్యప్ప కాలనీలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయ పనులను పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, భవిష్యత్‌లో త్వరితగతిన పనులు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. స్థానిక నాయకులు కూడా పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. దాతలు ముందుకు వచ్చి గుడి నిర్మాణానికి సహకరించాలని కోరారు.



# బక్రీద్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**- నగరంలో స్వయంగా పర్యటించి, భద్రతను పర్యవేక్షించిన సి పి గౌష్ ఆలం.**

**- బుట్చర్ హౌస్‌లను తనిఖీ చేసి, నిబంధనలు పాటించాలని నిర్వాహకులకు సీపీ ఆదేశం. నగరమంతటా పటిష్ట బందోబస్తు ఏర్పాటు**

**కరీంనగర్: నేషనలిస్ట్ వాయిస్**

బక్రీద్ పండుగను ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పిలుపునిచ్చారు. పండుగ సందర్భంగా నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. బక్రీద్ పండుగ ఏర్పాట్లలో భాగంగా గురువారం సీపీ గారు నగరంలోని పలు ప్రాంతాలలో స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు బుట్చర్ హౌస్ (కసాయి ఖానా)లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, పరిశుభ్రతను పాటించడంతో పాటు చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేస్తూ, నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం నగరంలోని సమస్యాత్మక ప్రాంతాలు, ప్రధాన చౌరస్తాలను సీపీ కలియతిరిగారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే వారిపై నిఘా ఉంచాలని, రాత్రి పగలు తేడా లేకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. శాంతియుత వాతావరణంలో పండుగ నిర్వహించుకునేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని, సామాజిక మాధ్యమాలలో వచ్చే వదంతులను నమ్మవద్దని సీపీ గౌష్ ఆలం కోరారు.

# వికారాబాద్ లో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

**కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించిన తెలంగాణ టీడీపీ రాష్ట్ర మాజీ వైస్ ప్రెసిడెంట్,పరిగి మాజీ జడ్పీటీసీ చంద్రయ్య**

**పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) మే 28**

తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి సందర్భంగా తెలంగాణ టీడీపీ రాష్ట్ర మాజీ వైస్ ప్రెసిడెంట్,పరిగి మాజీ జడ్పీటీసీ పి. చంద్రయ్య ఆధ్వర్యంలో టీటీడీపీ నాయకులతో కలిసి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం టిటిడిపి నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అభినవ్ సర్దార్ (సినీహీరో), నాయకులు మురళి కృష్ణ, చిన్నయ్య, నర్సిరెడ్డి, నాగప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





# మురికి కాలువలపై అక్రమ కట్టడాలు

**పిట్లం నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ మే 28**

పిట్లం కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని 13వ వార్డు మురికి కాలువలపై గతంలో అక్రమ కట్టడాలు వలన మురికి నీరు పోకుండా మురికి కలలపై బాత్రూం లో మరియు అరుగులు కట్టడం వల్ల మురికి నీరు సజావుగా పోకుండా జిపి సిబ్బంది తీయరాకుండా ఉంది ఈ యొక్క మురికి కాలువలో రాళ్లు వేయడంతో తీయడానికి ఇబ్బందిగా ఉండడంవల్ల మురికి నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద వలన 13వ వార్డు లో మురికి కాలువలు అద్వాన స్థితిలో ఉన్నాయి ఇకనైనా పిట్లం గ్రామ సర్పంచ్ మరియు కార్యదర్శి దీనిపై శ్రద్ధ వహించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుచున్నాము



# త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

**-కలిసిమెలిసి ఉంటూ మతసామరస్యాన్ని చాటాలి-గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలనే మైనార్టీ సోదరుల ఆలోచన ఆదర్శం**

**-సమైక్యతతోనే దేశం మరింత ముందుకు సాగుతుంది-కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

**భద్రాద్రి కొత్తగూడెం,మే28(నేషనలిస్ట్ వాయిస్):**



త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సమాజంలో ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని బోడగుట్ట ఏరియాలో ఉన్న ఈద్గాను ఆయన సందర్శించి అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదర కుటుంబాలను కలిసి వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని అందరూ సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మైనార్టీలపై దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటివని సమాజంలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని మైనార్టీ సంఘం నాయకుడు కోరడం అత్యంత అభినందనీయమని ఇది ముస్లింల ఉదార స్వభావానికి నిదర్శనమని శ్లాఘించారు. ఈ ప్రతిపాదనను తాము పూర్తిగా స్వాగతిస్తున్నామని ఇలాంటి ఆలోచనలు సమాజంలో మతసామరస్యాన్ని మరింత పెంపొందిస్తాయని ఆయన స్పష్టం చేశారు. పండుగ రోజున అందరి శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, మైనార్టీ సంఘాల నాయకులు నయీమ్ ఖురేషి, అబిద్ హుస్సేన్, అబ్దుల్ రబ్, అన్వార్ పాషా, యాసీన్, ఎండి యూసుఫ్, ఖమర్, ఫారూఖ్, అమీర్ ఖాద్రి, ఇస్మాయిల్, షకీల్, ఇమ్రాన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**భద్రాద్రి కొత్తగూడెం,మే28(నేషనలిస్ట్ వాయిస్):**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో వికే సీఎం ప్రాజెక్టు ప్రభావిత పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. సింగరేణి సంస్థ ప్రజల ఆరోగ్య సంక్షేమానికి కట్టుబడి ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ లలిత కుమారి మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపించి ఇలాంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహారావు మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ విక్టర్, ఏఐటీయూసీ నాయకులు ఎం.ఆర్.కే ప్రసాద్, ఐఎన్టియుసి నాయకులు గోపు కుమార్, ఇతర వైద్య సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# జూన్ 3న గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కీలక సర్వసభ్య సమావేశం

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనపై కార్యాచరణకు సిద్ధమవుతున్న సొసైటీ

**హైదరాబాద్, మే 28. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**




రాష్ట్రంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య మరోసారి ప్రధాన చర్చనీయాంశంగా మారుతున్న నేపథ్యంలో, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (జీహెచ్‌జే ఎంఏసీహెచ్‌సీ) ఆధ్వర్యంలో అత్యంత కీలకమైన సర్వసభ్య సమావేశం జూన్ 3వ తేదీన నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశం జూన్ 3న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుల ప్రక్రియను ఇటీవల ప్రారంభించిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడిందని వారు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న దాదాపు 1350 మంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఈ సొసైటీలో సభ్యులుగా ఉన్నారని, వీరిలో చాలా మంది 20 నుండి 30 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న సీనియర్ పాత్రికేయులేనని వివరించారు. 2008 సంవత్సరం నుంచే అనేక మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ ఇప్పటికీ ఆశలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది సీనియర్ జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం జీవితాంతం ఎదురుచూసి, ఆ కల నెరవేరకుండానే కన్నుమూసిన విషాద ఘటనలను కూడా వారు గుర్తుచేశారు. మీడియా రంగంలో జీవితాంతం ప్రజాసేవ చేసిన జర్నలిస్టులకు కనీస గృహ భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని సొసైటీ నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా పారదర్శకంగా ఇళ్ల స్థలాల కేటాయింపులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కేవలం హామీలకే పరిమితం కాకుండా కార్యరూపం దాల్చాలని సూచించారు. జూన్ 3న జరిగే సర్వసభ్య సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై సమగ్ర చర్చ నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. అదేవిధంగా సీనియర్ సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ప్రభుత్వంతో చర్చలు జరపడం, అవసరమైతే ఉద్యమ కార్యాచరణ చేపట్టడం వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు. సొసైటీకి చెందిన ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరై ఐక్యంగా తమ హక్కుల సాధనకు ముందుకు రావాలని అధ్యక్ష, కార్యదర్శులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల గృహ హక్కుల సాధనలో ఈ సమావేశం చారిత్రాత్మక మలుపు కానుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావును కలిసిన నత్తి మల్లేష్ ముదిరాజ్

**హైదరాబాద్, మే 28. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రాం చందర్ రావు గారిని బీజేపీ రాష్ట్ర నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్ గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న "రైతు గోస – బీజేపీ భరోసా" కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నందుకు రాం చందర్ రావు గారికి నత్తి మల్లేష్ ముదిరాజ్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, రైతు సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా నాయకులు వెల్లడించారు. రైతన్నల పక్షాన బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని, రైతుల సంక్షేమమే పార్టీ లక్ష్యమని తెలిపారు.



# భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడుకలు

**మందమర్రి, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

పట్టణం, మండలంలో ముస్లింలు గురువారం బక్రీద్ పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. రంజాన్, బక్రీద్ పండుగ పర్వదినాన ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. కొన్ని ప్రత్యేక పరిస్థితులను మినహాయించి, ప్రతి సంవత్సరం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. పట్టణం, మండలంలోని పలు ప్రాంతాలతో పాటు మార్కెట్ ప్రాంతంలో గల అస్ర మస్జిద్ ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు, అస్ర మస్జిద్ ఇమామ్ అజాం అలీ లు మాట్లా డుతూ, బక్రీద్ పండుగ ముస్లింలకు ఎంతో ప్రత్యేకమైందని త్యాగానికి, సేవకి ప్రతీకగా ముస్లింలు జరుపుకునే పండుగ పవిత్రమైన పండుగల్లో ఒకటని తెలిపారు. బక్రీద్ పండుగనే ఖుర్బానీ పండుగ, ఈద్ అల్-అధా అని సైతం పిలుస్తారన్నారు. రంజాన్ పండుగ తర్వాత వచ్చే ఇస్లామిక్ క్యాలెండర్ లో ముఖ్యమైన నెలల్లో ఈ నెల ఒకటని తెలిపారు. ప్రవక్త ఇబ్రహీం ఖలీలుల్లా కు ఒక్క రోజు నిద్రలో వచ్చిన కలలో అల్లాహ్ ఇబ్రహీం ఖలీలుల్లాను అత్యంత ప్రతీకరమైనది తనకు సమర్పిం చమని ఆదేశించడంతో, ఇబ్రహీం ఖలీలుల్లా అత్యంత భక్తి శ్రద్ధలతో, విశ్వాసంతో తన కుమా రుడిని అల్లాహ్ కు సమర్పిం చేందుకు సిద్ధపడ్డగా, ఇబ్రహీం ఖలీలుల్లా విశ్వానికి మెచ్చిన అల్లాహ్ అతని కుమా రుడికి బదులుగా ఒక్క గొర్రెను తనకు సమర్పించి, దాని మాంసాన్ని పేదలకు పంచమని ఆదేశించాడని, ఇబ్రహీం ఖలీలుల్లా భక్తికి, త్యాగానికి గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని తెలిపారు. బక్రీద్ పండుగ త్యాగ స్ఫూర్తికి, అత్యున్నత భక్తికి ప్రతీక అని, ఇస్లాంలో బక్రీద్ పండగకు ప్రత్యేక స్థానం ఉందని, పేదలకు సహాయం చేసే స్ఫూర్తిని బక్రీద్ పండుగ సూచిస్తుందని వివరించారు. భక్తి, త్యాగాలకు ప్రతీకగా ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని, తమకు కలిగిన దాంట్లో నుంచి ఇతరులకు పంచి పెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ పండుగ కలిసిగిస్తుందని తెలిపారు. శాంతి, సహనం, దయ, కరుణ, ప్రేమ, ఐకమత్యం, మానవత్వానికి బక్రీద్ పండుగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో ఫక్రుల్ హుదా, ఎండి కబీరుద్దీన్, హాఫీజుద్దీన్, ఖాసీం, అజారుద్దీన్, చాంద్ పాషా, సర్వర్, మజారుద్దీన్, హనీఫ్, బబ్లు, పట్టణంలోని అస్ర మజీద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.



# పోయిన ఏడాది కొన్న వడ్ల ను దాటిన కొనుగోలు

**పోయిన ఏడాది మొత్తం తూప్రాన్ డివిజన్ లోని 6 మండలలో కొన్నది 4.77 లక్షల క్వింటాల్ లు మాత్రమే.**

**20 రోజుల్లోనే ఈ సంవత్సరం 4.80 లక్షలు క్వింటాల్ల కొనుగోలు పూర్తి.**

**ఆర్డీవో జయ చంద్రారెడ్డి**

**తూప్రాన్, మే, 28. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తూప్రాన్ డివిజన్ లోని 6 మండలలో పోయిన ఏడాది రబీ అనగా ఎండా కాలంలో 2 నెలల కాలం లో కొన్న వడ్ల మొత్తం నాలుగు లక్షల డెబ్బయి ఏడు క్వింటాళ్ల అని, ఈ ఏడాది 20 రోజుల్లోనే కొనుగోలు ఆ లక్ష్యాన్ని దాటినాయి అని తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి తెలియ జేశారు. గురువారం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మే 6 నుంచి తూప్రాన్ డివిజన్లో 87 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనాయి అని, మే 26 నాటికి అంటే 20 రోజుల్లో నే 4 లక్షల 80 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లులకు తరలించడం జరిగిందని, పోయిన ఏడాది కొన్న మొత్తం వడ్ల కంటే ఈ ఏడాది ఇప్పటికే ప్రభుత్వం ఎక్కువ కొనుగోలు చేయటం జరిగిందని చెప్పారు. వడ్లు ఈ సారి పెద్ద సంఖ్యలో ఉత్పత్తి అయినాయని, ఇంకో 2 లక్షల క్వింటాల్ వరకు కొనుగోలు కేంద్రాలలో ఉన్నాయని, ఇంకో 10 రోజుల్లో ముగిసే అవకాశం ఉన్నదని అన్నారు. రైస్ మిల్లుల లో స్తలం అయిపోవటం తో తూప్రాన్ లో, మనోహరాబాద్, యెల్దుర్తి మండలం లలో 6 మధ్యంతర గోడౌన్ లలో ధాన్యాన్ని దించిపిస్తున్నామని చెప్పారు. పంట దిగుబడి ఎక్కువ రావటం, బిహారీ నుంచి హమాలిలు రాకపోవటం అనే సమస్యలు ఉన్నప్పటికీ, వేగవంతంగా కొనుగోలు జరుగుతుందని తెలియ జేశారు.



# వీర్ సావర్కర్ దేశభక్తి స్ఫూర్తిదాయకం

**మందమర్రి, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త వినాయక్ దామోదర్ సావర్కర్ (వీర్ సావర్కర్) చూపిన అసమాన ధైర్యసాహసాలు, అచంచలమైన దేశభక్తి, సామాజిక సంస్కరణల పట్ల ఆయనకున్న శ్రద్ధ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుత సింగరేణి ఎస్ అండ్ పిసి ఉద్యోగి రాజేష్ పివ్వాల్ ఆయన సతీమణి రాణి పివ్వాల్ కొనియాడారు. గురు వారం సావర్కర్ 143వ జయంతిని పురస్కరించుకుని రాజేష్ పివ్వాల్ నివాసంలో వీర్ సావర్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించి, అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి పెట్టి, ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వినాయక్ దామోదర్ సావర్కర్ మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలో గల భాగూర్ గ్రామంలో జన్మించాడని, పూణేలో చదువుతున్నప్పుడే మేళా అనే సంస్థను ఏర్పాటు చేసి, తర్వాత దానిని అభినవ్ భారత్ గా మార్చారని తెలిపారు. లండన్ లో బారిస్టర్ చదువు కుంటూ ఇండియా హౌస్ ద్వారా విప్లవ కారులను సంఘటితం చేశారన్నారు. నాసిక్ కలెక్టర్ జాక్సన్ హత్య కేసులో సంబంధం ఉందనే ఆరోపణలతో సావర్కర్‌ను బ్రిటిష్ ప్రభుత్వం 1910లో అరెస్ట్ చేసి, రెండుసార్లు యావజ్జీవ శిక్ష (మొత్తం 50 సంవత్సరాలు) విధించిందని తెలిపారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం నిర్వహించి, అండమాన్ సెల్యులార్ జైలులో 12 సంవత్సరాలు జైలు జీవితం గడిపారని, అండమాన్ జైలులో ది ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ 1857 పుస్తకాన్ని పూర్తి చేశారన్నారు. హూ ఈజ్ ఏ హిందూ అనే గ్రంథంతో హిందూ జాతీయవాద భావజాలాన్ని ప్రచారం చేశారని తెలిపారు. 1922లో రత్నగిరికి పరిమితమైన తర్వాత, అంటరానితనం నిర్మూ లనకు, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు నడిపారని తెలిపారు. జీవితాంతం దేశం కోసం పరితపించిన పోరాట యోధుడు సావర్కర్, ఫిబ్రవరి 26, 1966న ముంబైలో కన్నుమూశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోని ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ రమేష్, సిహెచ్ మహేందర్, రాజు, శంకర్, డి తిరుపతి, రోజా, సుశీల, లక్ష్మి, చంద్రకళ, నిర్మల, రజిత, శ్రీజ లు పాల్గొన్నారు.



# ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని, ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ ప్రాంతంలో గల మునీందర్ అండ్ బ్రోస్ ఫర్టిలైజర్స్ గోదాంను అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాకు చెందిన ధాన్యం నిల్వ చేసేందుకు గోదాము కేటాయించడం జరిగిందని, ధాన్యం దిగుమతి వేగంగా నిర్వహించాలని, అవసరమైన మేరకు హమాలి సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలుగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. జూన్ 7వ తేదీ నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున, ఈలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం...

## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం జిల్లాలోని చెన్నూరు మండలం బావురావుపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిసిసి ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడు తుందని, ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఎకరానికి 25 క్వింటాళ్ల ధాన్యం వచ్చేదని, ఈసారి 28 నుండి 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. చెన్నూరు, కోటపల్లి ప్రాంతాలలో పంట ఆలస్యంగా వస్తున్నందున జూన్ 15వ తేదీ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. 2022-23 లో 1 లక్ష 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈసారి ఇప్పటివరకు 1 లక్ష 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, జూన్ 6వ తేదీ వరకు 30 వేల నుండి 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, మొత్తంగా దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. లారీలు సమకూర్చడం కొరకు సింగరేణి సంస్థతో మాట్లాడడం జరిగిందని, ఇసుక లారీలను ధాన్యం రవాణాకు మళ్ళించడం జరిగిందని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను ఆందోళన చేపట్టే దిశగా రెచ్చ గొడుతున్నారని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం కలిసి రావాలని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, చెన్నూరు మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, జైపూర్ మండలంలో వచ్చే 3 రోజులలో ధాన్యం ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని జైపూర్ మండలంలో గల సుముఖ గోదాములోనికి చెన్నూరు నుండి వచ్చే ధాన్యాన్ని అనుమతించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 70 శాతం ధాన్యం ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, చెన్నూరు, కోటపల్లి మండలాలకు సంబంధించి ధాన్యం ప్రక్రియను 15 రోజులలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉందని, ఈలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ చెన్నూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ దర్శి మధుకర్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లా కేంద్రమైన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం ముస్లింలు బక్రీద్ పండుగ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఆండాలమ్మ కాలనీ ఈద్గా వద్ద, మంచిర్యాల బస్టాండ్ కబ్రస్తాన్ దర్గా వద్ద నిర్వహించిన బక్రీద్ పండుగ వేడుకల్లో కార్పొరేషన్ మేయర్ దర్శి మధుకర్ పాల్గొని, ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేయర్ మధుకర్ మాట్లాడుతూ, బక్రీద్ పండుగ ముస్లింలకు ఎంతో ప్రత్యేకమైందని త్యాగానికి, సేవకి ప్రతీకగా ముస్లింలు జరుపుకునే పండుగ పవిత్రమైన పండుగల్లో ఒకటని తెలిపారు. బక్రీద్ పండుగ త్యాగ స్ఫూర్తికి, అత్యున్నత భక్తికి ప్రతీక అని, ఇస్లాంలో బక్రీద్ పండగకు ప్రత్యేక స్థానం ఉందని, పేదలకు సహాయం చేసే స్ఫూర్తిని బక్రీద్ పండుగ సూచిస్తుందని వివరించారు. భక్తి, త్యాగాలకు ప్రతీకగా ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని, తమకు కలిగిన దాంట్లో నుంచి ఇతరులకు పంచి పెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ పండుగ కలిసిగిస్తుందని తెలిపారు. శాంతి, సహనం, దయ, కరుణ, ప్రేమ, ఐకమత్యం, మానవత్వానికి బక్రీద్ పండుగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పోరేటర్ తూముల నరేష్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.





# మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

**మందమర్రి, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

తెలంగాణలో మిలిటెంట్ దాడులు చేస్తేనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని బిఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులను రెచ్చగొట్టే విధంగా బిఆర్ఎస్ నాయ కుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి, టిపిసిసి ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధికార ప్రతినిధి సట్ల సంతోష్, సీనియర్ నాయకుడు సోత్కు సుదర్శన్ లు డిమాండ్ చేశారు. గురువారం పట్టణ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, టిబిజికేఎస్ కార్యవర్గ సమావేశంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి మాజీ ఎంపీ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పుడు ఉన్న వారికి అనుబంధ సంఘాల టిబి జికేఎస్ నాయకులను ఉపయోగించి, సింగరేణి కార్మికలను మభ్యపెట్టి, కారుణ్య నియామకాలతో కార్మికుల, సింగరేణి సొమ్మును కొల్లగొట్టి, కార్మికులను మోసం చేసిన ఘనత ఆ పార్టీ వారిదని ఆరోపించారు. చెన్నూరు నియోజక వర్గంలో టిఆర్ఎస్, టిబిజికేఎస్ నాయకులు ప్రజల కోసం, కార్మికల కోసం ప్రతిపక్ష నాయకులుగా ప్రభుత్వ వైఫల్యాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి కానీ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా చేస్తూ, సస్యశ్యామలంగా ఉన్న రాష్ట్రాన్ని విధ్వంసం చేసే విధంగా వాఖ్యలు చేశారని విమర్శించారు. కార్మికులను భయాందోళనకు గురి చేసే విధంగా, ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపే విధంగా, కలిసి ఉన్న ప్రజాస్వామ్య, స్నేహ పూరిత ప్రజల మధ్య చిచ్చు పెట్టే విధంగా వ్యాఖ్యలు మంచిది కాదని, ఇటువంటి వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని మండి పడ్డారు. యువతను తప్పు దోవ పట్టిస్తూ, మద్యానికి బానిసలుగా చేసి, వారి రాజకీయ స్వలాభం కోసం యువతను వాడుకొని, వారి భవిష్యత్ ను నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత బిఆర్ఎస్ రాజకీయాలను గమనించాలని సూచించారు. సింగరేణి మందమర్రి ఏరియా జిఎం కార్యాలయాన్ని, హైదరాబాద్ సింగరేణి భవన్ లను కాల్చండి, అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులైన రైల్వే లైన్లను కోసి వేయండని విద్వేషపూరిత మాటలను ప్రజా ప్రతినిధిగా బాల్క సుమన్ మాట్లాడటం సిగ్గు చేటు అన్నారు.



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగిస్తూ, ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. అదేవిధంగా చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక, గనుల, ఉపాధి శిక్షణ, జియాలజి ఫ్యాక్టరీల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, అధికారం కోల్పోయి, మతిస్థిమితం కోల్పోయి, మానసికంగా ప్రభుత్వం పై చేస్తున్న ఆరోపణలు సిగ్గు చేటు అని, ఒకసారి ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాలని దానికి తమ వంతుగా కృషి చేస్తామని ఎద్దేవ చేశారు. ఇప్పటికైనా బాల్క సుమన్ తన పద్ధతి మార్చుకోకపోతే మరొకసారి చెన్నూరు నియోజకవర్గ ప్రజలు ఇంతకు ముందు చెప్పిన బుద్ధి, మరొకసారి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గడ్డం రజిని, సేవాదళ్ పట్టణ అధ్యక్షుడు సోత్కు ఉదయ్, నాయకులు నేరువట్ల శ్రీనివాస్, ఎండీ పాషా, వీరన్న, బండి శంకర్, బేర వేణు గోపాల్, వనం నర్సయ్య, దుర్గం ప్రభాకర్, కొలిపాక సదానందం, సట్ల సంతోష్, బత్తుల సరిత, రాధ, సమత, మహిళా సీనియర్ నాయకురాలు పోచంపల్లి లక్ష్మీ, రెడ్డి ఐయులయ్య, నాయకులు ఎర్ర రాజు, తుంగపిండి శంకర్, ఆడెపు వేణు, సామెల్, మధు, సంపత్, రవి, రామ్, గాదె రాములు, నామిని ముత్తయ్య, రాజేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, సాత్విక్, రాజు, మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఇంచార్జ్ చిప్పకుర్తి శశిధర్, సోషల్ మీడియా ఇంచార్జ్ మూడరపు శేఖర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయబడి కేటాయించబడిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం రామారావుపేట లోని సుముఖ గోదాము, హాజీపూర్ మండలంలోని గాయత్రి రైస్ మిల్లును అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు మాట్లాడుతూ, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలును చేపట్టడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైస్ మిల్లులు, గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతిని వేగవంతంగా చేపట్టాలని, రోజుకి కనీసం 40 నుంచి 50 లారీల ధాన్యం దిగుమతిని చేయాలని తెలిపారు. ధాన్యం దిగుమతికి సరిపడా హమాలీలను సమకూర్చడం జరిగిందని, దిగుమతి త్వరితగతిన పూర్తి చేసి ఈ నెలాఖరులోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఐనాపూర్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాం - ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి

**దోమ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి మే 28**

దోమ మండలం ఐనాపూర్ గ్రామంలో సుమారు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర, ప్రాముఖ్యత గురించి గ్రామ పెద్దలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కె. రజిత ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, ఆలయ పునర్నిర్మాణ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు త్వరలో మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో ఉన్న ఖాళీ స్థలాన్ని ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. గ్రామ సర్పంచ్ కె. రజిత భాస్కర్ గౌడ్ మరియు పూలే అంబేద్కర్ యువజన సంఘం సభ్యుల విజ్ఞప్తి మేరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గ్రామానికి మినీ ఫంక్షన్ హాల్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాంత కుమార్, గ్రామ సర్పంచ్ కె. రజిత భాస్కర్ గౌడ్, ఉప సర్పంచ్ నల్ల మానస సాయిలు, పార్టీ సీనియర్ నాయకులు ఎం.డి. జఫ్ఫార్, ఎడిగి ఆశన్న గౌడ్, బహుజన ఉద్యమ కారుడు మాదిగ మల్లన్న, ఎడిగి వెంకటేష్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన సంఘం సభ్యులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





# తెలుగు జాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్

## ఉపాధి కూలీలతో కలిసి ఎన్టీఆర్ జయంతి వేడుకలు

## టీడీపీ రాష్ట్ర నాయకులు జడ రాములు యాదవ్

**వేములపల్లి మే 28 నేషనలిస్ట్ వాయిస్ :**

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా టీడీపీ రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్, సింగిల్‌ఆ విండో చైర్మన్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు పండ్లు పంపిణి చేయడం జరిగింది ఈ సందర్భంగా జడ రాములు యాదవ్ మాట్లాడుతూ తెలుగు సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ సృష్టించిన ప్రభంజనం చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వెండితెరపై తన అపూర్వ నటనతో కోట్లాది అభిమానుల హృదయాలను గెలుచుకున్న ఎన్టీఆర్, రాజకీయాల్లో ప్రజాహిత పాలనతో తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. పౌరాణిక, జానపద, సామాజిక చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు తెలుగు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచి పోయాయని తెలిపారు. ముఖ్యంగా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి దైవిక పాత్రల్లో ఆయన నటన ప్రజల హృదయాల్లో దైవసమాన స్థానం సంపాదిం చిందన్నారు. ఏ పాత్ర పోషించినా అందులో జీవించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయగల మహా నటుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ గుండె బోయిన మల్లయ్య, వార్డు మెంబెర్స్ జడ మహేశ్వరీ సైదులు యాదవ్, వలపట్ల మాధవి రమేష్, నాయకులు జడ మల్లేష్, నన్నెబోయిన సైదులు, చిలకల నాగయ్య, గంగుల వెంకన్న, శ్రీకాంత్, పగిళ్ళ శివ, సతీష్ తదితరులు పాల్గొన్నారు



# హనుమాన్ దేవాలయం సందర్శించిన స్వామీజీ

**కరీంనగర్ నేషనలిస్ట్ వాయిస్**

స్థానిక 2వ డివిజన్,తీగలగుట్టపల్లి విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీ హనుమాన్ దేవాలయాన్ని శ్రీ రామదాసి సురేష్ ఆత్మరామ్ మహారాజ్ స్వామీజీ సందర్శించి శ్రీ రామ పాదుకల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన స్వామీజీ,భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ హనుమాన్ దేవాలయ నిర్మాణం భక్తుల ఐక్యతకు,ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఆలయ నిర్మాణం ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తవ్వాలని ఆంజనేయ స్వామిని ప్రార్థించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు,కాలనీ పెద్దలు,యువకులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఐకెపి కార్యాలయం ముందు వివోఏల సమ్మె బాట

**చిన్న శంకరంపేట మే 28,(నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి)**

చిన్న శంకరంపేట మండలం ఐకెపి కార్యాలయం ముందు మండల వివోఏ లు సమ్మెకు దిగారు, జూన్ 2వ తేదీ వరకు సమ్మె నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు, ఈ సందర్భంగా వివోఏలు మాట్లాడుతూ వివోఏ ల సంగం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమ్మె చేపట్టడం జరిగింది, జూన్ 2 వరకు సమ్మె చేయడం జరుగుతుందని, విఓఏ ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు, గతప్రభుత్వంలోను ఎప్పుడు సమ్మె చేసిన పట్టించుకున్న పాపాన పోలేదని ప్రస్తుతం ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను వెంటనే నెరవేర్చాలని వారు కోరారు, 20000 రూపాయల కనీస వేతనం చెల్లించాలని, 20 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని, అర్హులైన వివోఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి స్వప్న, ఉపాధ్యక్షులు శంకర్, కోశాధికారి లత, సహాయ కార్యదర్శి అరుణ, లావణ్య శశిరేఖ, సుజాత, ఆంజనేయులు, నాగమణి, రోషిణి,యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



# మిషన్ భగీరథ పైప్లైన్ లీగేజ్

**పిట్లం నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ మే 28**

పిట్లం కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మిషన్ భగీరథ పైప్ లైన్ ఆర్టీసీ బస్టాండ్ లోనికి వెళ్లే క్రాసింగ్ వద్ద ఈ యొక్క పైప్ లైన్ పగలడం వల్ల పైప్లైన్ వాటర్ ట్యాంకు వెళ్లే ఈ యొక్క పైప్ లైన్ పగలడంతో శాంతినగర్ రాజీవ్ గాంధీ కాలనీ డిఆర్ఎఫ్ కాలనీ ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు వేసవికాలం దృశ్య నీటి సరఫరా లేక నానా అవస్థలు పడుతున్నారు మిషన్ భగీరథ ఇన్చార్జ్ ఏ ఈ గారికి విన్నవించుకున్న శ్రద్ధ చూపడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు కావున ఇకనైనా ఈ యొక్క పైప్ లైన్ మరమ్మతులు చేసి కాలనీ వాసులకు నీటి సరఫరా అందించాలని ప్రజలు కోరుతున్నారు



# దోమలో ఘనంగా బక్రీద్ వేడుకలు

## ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి

**దోమ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి మే 28**

దోమ మండల కేంద్రంలో నిర్వహించిన బక్రీద్ పండుగ వేడుకల్లో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభా కాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానిక మసీదులో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, రాష్ట్రంలో శాంతి సౌభ్రాతృత్వాలు నెలకొనాలని ఆకాం క్షించారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, ఆనందంగా పండుగలు జరుపుకోవడం తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దోమ సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్ర రెడ్డి , దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శాంత కుమార్ , గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మైనార్టీ సోదరులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## అన్ని విభాగాల సమన్వయంతోనే

# సంస్థ ప్రగతి సాధ్యం

## ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ

**మందమర్రి, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో చేరుకోవడానికి అన్ని విభాగాలు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం ఏరియా జిఎం కార్యాలయంలో పర్సనల్, అకౌంట్స్, సివిల్ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల వారీగా జరుగుతున్న పనులు, సాధించిన పురోగతిపై జిఎం క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి ప్రగతిలో ప్రతి విభాగం ఒక కీలకమైనదని, అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఏరియాను అగ్రగామిగా నిలపాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఏజిఎం ఎఫ్ అండ్ ఏ ఆర్వీఎస్ఆర్కే ప్రసాద్, డిజిఎం పర్సనల్ సిహెచ్ అశోక్, డిజిఎం ఐఈడి కిరణ్ కుమార్, సివిల్ ఎస్ఈ శ్రీధర్, సీనియర్ పర్సనల్ అధికారి సత్యనారాయణ, అన్ని గనుల సంక్షేమ అధికారులు, సివిల్ అధికారులు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.




# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లాలోని బెల్లంపల్లి పట్టణం లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి పెట్టి, వేడుకలు నిర్వహించారు. అనంతరం టిడిపి పట్టణ అధ్యక్షుడు, టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఠాకూర్ మణిరాం సింగ్ మాట్లాడుతూ, టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల కాలంలోనే అధికారంలోకి తీసుకువచ్చి రికార్డు సృష్టించారని గుర్తు చేశారు. ఎంతో మంది బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించారని, ప్రజల సంక్షేమం కొరకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి, చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఆయన పార్టీ ఆవిర్భావ సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చారని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కొరకు రెండు రూపాయలకే కిలో బియ్యం, మద్యపానం నిషేధం, పటేల్ పట్వారి వ్యవస్థ రద్దు, మండల వ్యవస్థ పునరుద్ధరణ, మహిళలకు ఆస్తి హక్కు తదితర అనేక కార్యక్రమాలు ఎన్టీఆర్ అమలు చేశారని, సింగరేణిలో సైతం పరుగు పందెంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు బొల్లు మల్లయ్య, సిహెచ్ రమేష్, తాండూరు మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, కల్లుగీత కార్మిక సంఘం నాయకుడు రామగుని గంగాధర్ గౌడ్, నాయకులు ఓ జీవరత్నం, ఎస్కే అస్గర్ బాషా, ఎండి యాసిన్, ఎం రాజయ్య, పుల్లూరి భూషణ్, బి సత్యనారాయణ, మాదాని గోపాల్, పి రాములు, తివారి, గైని తిరుపతి లు పాల్గొన్నారు.



# ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు

**పిట్లం నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ మే 28**

పిట్లం కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని ముస్లిం సోదరులకు బక్రీద్ పండగ పురస్కరించుకొని శుభాకాంక్షలు ముస్లిం సోదరులకు పవిత్రమైన పండగ బక్రీద్ ఈ శుభ సందర్భంగా పిట్లం గ్రామంలో ముస్లిం సోదరులు పిల్లలు ఒకరినొకరు అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు ఈరోజు బక్రీద్ పండగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు ఈ యొక్క శుభ సందర్భంగా పిట్లం గ్రామ ప్రజా ప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు చిన్న పెద్ద తేడా లేకుండా ముస్లిం సోదరులకు అన్ని మతాలకు అతీతంగా రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు వారి స్నేహితులు అలింగణం చేసుకొని బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు



# విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి బోద హరికృష్ణ బలి?

## - పోల్ ఎక్కి కిందపడి ప్రాణాపాయ స్థితిలో యువకుడు!

## - కొతవారీ అగ్రహారంలో విషాదం అధికారుల వైఫల్యంపై గ్రామస్తుల ఆగ్రహం

**జగ్గయ్యపేట, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

ఎన్.టి.ఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం కొతవారీ అగ్రహారం గ్రామంలో చోటుచేసుకున్న ఒక ఘోర ప్రమాదం విద్యుత్ శాఖ పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. గ్రామానికి చెందిన బోద హరికృష్ణ అనే యువకుడు విద్యుత్ స్తంభం ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడి, ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే, ఈ ప్రమాదం కేవలం ఒక వ్యక్తి దురదృష్టమా? లేక విద్యుత్ శాఖ అలసత్వానికి నిదర్శనమా? అనే చర్చ ఇప్పుడు స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గ్రామంలో దాదాపు వెయ్యికి లోపు విద్యుత్ మీటర్లు (కనెక్షన్లు) ఉన్నాయి. ఇంత చిన్న గ్రామంలో కూడా విద్యుత్ వ్యవస్థ పర్యవేక్షణ, మరమ్మతుల నిర్వహణలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తుఫానులు, ఈదురు గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ తీగలు తెగిపోవడం, స్తంభాలు దెబ్బతినడం వంటి సమస్యలు ఇక్కడ నిత్యకృత్యంగా మారాయి. సమస్యలు వచ్చినప్పుడు అధికారులకు ఫిర్యాదు చేసినా, వాటిని వెంటనే సరిచేసే నాథుడే కరువయ్యాడని ప్రజలు మండిపడుతున్నారు. జరిగిన వివరాలు ప్రకారం యువకుడు పోల్ ఎందుకు ఎక్కాల్సి వచ్చింది? విద్యుత్ సరఫరా నిరంతరం సురక్షితంగా ఉండేలా చూడటం, ఓవర్‌హెడ్ లైన్లను నిరంతరం తనిఖీ చేయడం, ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించి నివారించడం లైన్మెన్‌లు, విద్యుత్ శాఖ అధికారుల ప్రాథమిక బాధ్యత. కానీ, ఆ బాధ్యతలన్నీ కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "విద్యుత్ శాఖ సకాలంలో స్పందించి, లైన్లను సరిచేసి ఉంటే హరికృష్ణకు ప్రాణాలను పణంగా పెట్టి స్తంభం ఎక్కాల్సిన అవసరం ఎందుకు వచ్చేది? సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమైతే, సామాన్య ప్రజలు తమ పనుల కోసం ప్రాణాల మీదకు తెచ్చుకోవాలా?" అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి ఘోర ఘటన జరిగిన తర్వాత కూడా విద్యుత్ శాఖ అధికారులు మౌనం వహించడంపై ప్రజల్లో మరింత ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఒక యువకుడు ప్రాణాపాయ స్థితిలో కొట్టు మిట్టాడుతుంటే, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని స్థానికులు నిలదీస్తున్నారు. హరికృష్ణ ప్రమాదానికి కారణమైన పరిస్థితులపై తక్షణమే ఉన్నతాధికారులతో విచారణ





జరిపించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన స్థానిక విద్యుత్ సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామంలోని ప్రమాదకర విద్యుత్ తీగలు, స్తంభాలను తనిఖీ చేసి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాలి. బోద హరికృష్ణ ప్రమాదం కేవలం ఒక కుటుంబానికి చెందిన విషాదం మాత్రమే కాదు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ శాఖ నిర్వహణలో ఉన్న లోపాలను, అధికారుల బేఖాతరుతనాన్ని ఎత్తిచూపుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని సర్వత్రా డిమాండ్ వినిపిస్తోంది.

# జీలుగుమిల్లిలో ఘనంగా 'మహానాడు'.. ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

**పోలవరం, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలో మహానాడు రెండవ రోజు వేడుకలతో పాటు, స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజల ఆశాజ్యోతి, తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్తపై ఉందన్నారు. అలాగే "పార్టీ కోసం, మహానాడు కార్యక్రమ విజయవంతం కోసం అహర్నిశలు శ్రమించిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు నా అభినందనలు." అని కొవ్వాసు జగదీశ్వరి, శాప్ డైరెక్టర్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా పలువురు నాయకులు గుర్తుచేసుకున్నారు. ఈ మహానాడు సంబరాల్లో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, మరియు యువత భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మండల వ్యాప్తంగా పసుపు పండుగ వాతావరణం సంతరించుకుంది. స్థానిక టీడీపీ ముఖ్య నేతలు ఈ వేడుకల్లో కీలక పాత్ర పోషించారు.



# నందిగామ పెద్ద మసీదులో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు: పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు

**నందిగామ, మే 28 (నేషనలిస్ట్ వాయిస్):**

త్యాగానికి ప్రతిరూపం, భక్తికి నిదర్శనమైన పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని పెద్ద మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పాల్గొని, ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక దువా చేశారు. అనంతరం వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సమాజంలో సోదరభావం, ప్రేమ, మానవత్వాన్ని మరింత బలపరిచేందుకు స్ఫూర్తినిస్తుందని ఆకాంక్షించారు. ఈ పవిత్ర పర్వదినం ప్రజలందరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు, అంతులేని ఆనందాన్ని నింపాలని ఆయన కోరుకున్నారు. "మతసామరస్యానికి, త్యాగానికి బక్రీద్ పండుగ ఒక గొప్ప నిదర్శనం. ప్రతి ఒక్కరూ ఒకరినొకరు గౌరవించుకుంటూ, కలిసిమెలిసి జీవించినప్పుడే సమాజం ప్రగతిపథంలో పయనిస్తుంది." అని డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ పట్టణ వైఎస్సార్సీపీ అధ్యక్షులు మహమ్మద్ మస్తాన్, పార్టీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం పెద్దలు మాజీ ఎమ్మెల్యేను ఆత్మీయంగా సత్కరించారు.





# రాష్ట్ర గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఆత్రం సుగుణక్క

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 28(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం రౌట సంకేపల్లి గ్రామంలో ఈనెల 29న నిర్వహించనున్న జల్ జంగల్ జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం 2026 కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ హాజరుకానున్నారు. ఆదివాసుల సంప్రదాయాలు, సంస్కృతి, హక్కులు మరియు అభివృద్ధికి అంకితమైన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గం ఇంచార్జి శ్యాం నాయక్ పరిశీలించారు. ఆదివాసుల ఆత్మగౌరవం, జీవన విధానం, హక్కుల పరిరక్షణకు ప్రతీకగా ఈ గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర గవర్నర్ పర్యటన నేపథ్యంలో గ్రామంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రికెటర్ నాగేంద్ర, డీసీసీ ఉపాధ్యక్షులు భీంరావు, దీపక్ ముండే, సర్పంచ్ ఆత్రం కొండు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.





# మహానాడు డిజిటల్ హాజరుతో పోలవరం నియోజకవర్గం సత్తా

## - టీడీపీ తమ్ముళ్లకు బొరగం శ్రీనివాసులు, కోళ్ల నాగేశ్వరరావు ధన్యవాదాలు

**పోలవరం మే 28 (నేషనలిస్ట్ వాయిస్ )**

పోలవరం నియోజకవర్గం నుంచి మహానాడు కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరై డిజిటల్ హాజరును విజయవంతంగా నమోదు చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు నియోజకవర్గ ఇంచార్జ్ బొరగం శ్రీనివాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోలవరం మండల అధ్యక్షులు మంగిన వెంకటరమణ, మండల క్లస్టర్ ఇంచార్జ్ ఆకుల కొండబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. క్లస్టర్ల వారీగా క్రమశిక్షణతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరినీ నాయకులు అభినందించారు. తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మహానాడుకు పోలవరం నియోజకవర్గం నుంచి విశేష స్పందన లభించిందన్నారు. పార్టీ పట్ల కార్యకర్తల నిబద్ధత, అంకితభావం అభినందనీయమని కొనియాడారు. క్లస్టర్005లో అత్యధికంగా 2385 మంది డిజిటల్ హాజరు నమోదు చేయగా, క్లస్టర్008లో 2200 మంది హాజరయ్యారు. మొత్తం పది క్లస్టర్ల నుంచి వేల సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని మహానాడును విజయవంతం చేశారు. పార్టీ పిలుపునందుకొని మహానాడును విజయవంతం చేసిన పోలవరం నియోజకవర్గ తమ్ముళ్లందరికీ ధన్యవాదాలు" అని ముఖ్య అతిథులు బొరగం శ్రీనివాసులు, కోళ్ల నాగేశ్వరరావు తెలిపారు.



# రైతుగా మారిన టెక్కీ పిడుగుపాటుకు గురై హఠాన్మరణం

**బెగళూరు,మే28 (నేషనలిస్ట్ వాయిస్)**

సాఫ్ట్‌వేర్ జాబ్‌ను వదిలి వ్యవసాయ రంగంలోకి దిగిన ఒక వ్యక్తి పొలంలో పిడుగుపాటుకు గురై మరణించాడు. ఈ విషాద ఘటన బుధవారం కర్ణాటకలో చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, మడికేరి టౌన్‌కు చెందిన రోషన్ బాలకృష్ణ ఇటీవలే సాఫ్ట్‌వేర్ జాబ్‌కు రాజీనామా చేసి వ్యవసాయ రంగంలోకి దిగారు. తన స్నేహితుడితో కలిసి పనిచేస్తున్నారు. వ్యవసాయ యంత్రాల మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. ఈ క్రమంలో తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు నిర్ణయించిన ఆయన మైసూరులోని ఒక పొలాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఆయన వెంట భార్య, కొడుకు కూడా వెళ్లారు. ఈ క్రమంలో పొలం సమీపంలోని చెట్టు నుంచి మామిడి పండును ఆయన కోసేందుకు ప్రయత్నిస్తుండగా పిడుగు పడింది. దీంతో, కుప్పకూలిన రోషన్ ఘటనా స్థలంలోనే మరణించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి కూడా స్వలంగా గాయపడ్డారు.

# రాజుపోతేపల్లిలో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

**టి.నరసాపురం, మే 28:(నేషనలిస్ట్ వాయిస్)**

ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండల పరిధిలోని రాజుపోతేపల్లి గ్రామంలో గురువారం నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. టి.నరసాపురం మండల టిడిపి ఉపాధ్యక్షులు దావులూరి సూర్యనారాయణ, రాజుపోతేపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు మద్దిపాటి కనకదుర్గారావుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. తెలుగు జాతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి జయంతి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ జయంతి వేడుకల్లో పోలవరం నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు చిలకా సుబ్బుతో పాటు ప్రముఖ టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో: కొల్లి వెంకటేశ్వరావు, ఉండవల్లి చంద్రశేఖర్, మూసునూరి బాలస్వామి, సూరెడ్డి శ్రీనివాస్, కొల్లి కిరణ్, గుండు శంకర్, చిలక బాలయ్య, చిలకా రామారావు, తాడేపల్లి బాలస్వామి, నత్త నాగరాజు, అందుగుల గాంధీ, చిలక రాంబాబు, చిలకా ప్రకాష్, గుడిదల ఏసు, జాన్రాజ్, పేరుబోయిన చెల్లారావు, మరియు గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.






# అధునాతన శిక్షణా కేంద్రం (ఎ టి సి ) మంజూరు

## - స్థానిక గిరిజన, వెనుకబడిన వర్గాల యువతకు పెరగనున్న ఉపాధి అవకాశాలు...

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 28 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)


JUPALLY KRISHNA RAO
Minister for Prohibition & Excise,
Tourism, Culture and Archaeology

Room No. 13 to 16,,4th Floor,
Dr. B.R. Ambedkar, Telangana State Secretariat
Hyderabad-500 004
Ph: 040-2345 0368
Mobile: 98480 14089, 94406 17267
E-Mail : peshi-min-petca@telangana.gov.in

Lr. No. 3616 /RB/Min(P&E,T,C&A)/2026, dated 25.05.2026.

Dear Gaddam Vivekanand garu,

Sub:- Request for sanction of ATC (Advance Training Centre) in Asifadad Constituency – Reg.

*****

I am to bring to your kind notice that the Asifabad Constituency, being a predominantly tribal and industrially backward region, requires urgent attention in the sphere of skill development and vocational training. The youth of this area, though talented and hardworking, lack access to advanced training facilities that can equip them with employable skills and prepare them for opportunities in both industrial and service sectors.

The **establishment** of an **Advance Training Centre (ATC)** in Asifabad will serve as a vital institution to provide specialized training in modern trades and technologies, enhance employability of local youth, particularly from Scheduled Tribes and economically weaker sections, Support industries and enterprises in the region with a skilled workforce and reduce migration by creating local employment opportunities.

In view of the above, it is requested to look into the matter and issue necessary orders positively for sanction for setting up an (Advance Training Centre (**ATC) in Asifabad Constituency** at the earliest.

With warm regards

(JUPALLY KRISHNA RAO)
Incharge Minister, Erstwhile Adilabad District

To
**Sri. Gaddam Vivekanand Garu,**
**Hon'ble Minister for Labour, Employment,**
**Training & Factories, Mines & Geology,**
Govt. of Telangana,
Hyderabad.

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వెనుకబడిన మరియు గిరిజన ప్రాంతమైన ఆసిఫాబాద్ నియోజకవర్గ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఇక్కడ ఒక అధునాతన శిక్షణా కేంద్రాన్ని (ూాంఋఝుఅషెవం ంతీఋఅఅఅస్త్ర జవత్తీవ - ఎ టి సి) మంజూరు చేసినందుకు ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ అజ్మీరా శ్యామ్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి మరియు సంబంధిత మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ నాయక్ గారు మాట్లాడుతూ ఆసిఫాబాద్ ప్రాంత యువత ఎంతో ప్రతిభావంతులైనప్పటికీ, సరైన సాంకేతిక, వృత్తి విద్యా నైపుణ్యాలు లేక ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వర్యులు జుపల్లి కృష్ణ రావు మరియు కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ మంత్రి వర్యులు గడ్డం వివేకానంద్ కు ప్రత్యేక చొరవ తీసుకుని ఆసిఫాబాద్‌కు ఎ టి సి ని మంజూరు చేయడం అభినందనీయం అని కొనియాడారు. ఈ కేంద్రం ఏర్పాటు ద్వారా స్థానిక షెడ్యూల్డ్ తెగలు (యస్ టి) మరియు ఆర్థికంగా బలహీన వర్గాల యువతకు ఆధునిక సాంకేతికతలపై ప్రత్యేక శిక్షణ లభిస్తుందని, దీనివల్ల వలసలు తగ్గి స్థానికంగానే పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి, యువత సంక్షేమానికి కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రి కి ఇంచార్జీ మంత్రి కి, గడ్డం వంశీ కి ఆసిఫాబాద్ ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# మాలి సంక్షేమ సంఘం కమిటీ లను ఏర్పాటు చేయుట్ట

సిర్పూర్ కాగజ్నగర్ ప్రతినిధి మే 28 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ )

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో మాలి సంక్షేమ సంఘ భవనంలో మాలీల అత్యవసర సమావేశంలో పాల్గొని ఈనెల జరిగే 30 తేదీన సమయం ఉదయం 10:30 నిముషాలకు అదిలాబాద్ ఎక్స్ రోడ్ భాగ్యనగర్ జ్ఞానేశ్వర్ మందిరంలో మాలిల కమిటీ వేయుటకు అందరూ పెద్ద సంఖ్యలో మాలిల రాష్ట్ర జిల్లా కమిటీ భర్తీ చేయడం మరియు రాష్ట్ర మరియు జిల్లా యూత్ కమిటీ మరియు డివిజన్ కమిటీ వేయడం జరుగుతుంది. కాబట్టి మాలి కులస్తులు అందరు వచ్చి విజయవంతం చేయాలని మాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సెండే వాసు, కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గురునులే మారుతి, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు మెంగాజీ, వాంకిడి మండల అధ్యక్షుడు వాడే బాబురావు , ప్రధాన కార్యదర్శి వాడై జ్యోతిబా, కోశాధికారి కృష్ణ, వాంకిడి మండల గౌరవ అధ్యక్షుడు వడై గౌరయ్య, బాబురావు, రాజ్ కుమార్, రమేష్, శ్రీను, పురుషోత్తం, రామచందర్, మాలి కులస్తులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్న కొండ ప్రశాంత్ రెడ్డి

దేవరకద్ర మే 28 నేషనలిస్ట్ వాయిస్

అస్సాం రాష్ట్రం లోని గౌహతి నగరానికి సమీపంలో నీలాచల్ కొండలపై వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఇది భారతదేశంలోని 51 శక్తి పీఠం ఇక్కడ ఉన్న కామాఖ్య అమ్మవారిని గురువారం దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి కొండ





ప్రశాంత్ రెడ్డి, దర్శించుకొన్న రు. అనంతరం ప్రత్యేకంగా కామాఖ్య అమ్మవారికి పూజ కార్యక్రమాలో పాల్గొన్నారు.

# బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీకి బలమైన పునాది

## వైసీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు

తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 28 (నేషనలిస్ట్ వాయిస్)



బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీకి బలమైన పునాది అని వైసీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు సూచించారు. వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు అధ్యక్షతన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక గమిని ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైకాపా జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు, నరసాపురం పార్లమెంట్ ఇంచార్జి గూడూరి ఉమాబాల, వైసీపీ అధికారిక ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకపాత్ర పోషించాల్సింది బూత్ లెవెల్ ఏజెంట్లేనని, వీరంతా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిమిత్తం బూత్ లెవెల్ ఏజంట్లు చేయాల్సిన కార్యాచరణను తెలియజేశారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి విషయంపై బూత్ లెవెల్ ఏజెంట్లు అవగాహనను పెంచుకుని ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రముఖ పాత్ర బీఎల్ఏలదేనని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఇప్పటినుంచే సిద్ధంగా ఉంటూ పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పాటించాల్సిన నియమాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. ముందుగా కార్యకర్తలు, నాయకులు వద్ద సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు రెండు మండలాల్లో ఎమ్మెల్యే పర్యటన

దేవరకద్ర మే 28నేషనలిస్ట్ వాయిస్



దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర చిన్నచింతకుంట మండలాల్లో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి పర్యటిస్తున్నట్లు మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటలకు చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలో చిన్న చింతకుంట మండలం కు చెందిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారు అని అధ్యక్షులు తెలిపారు. సాయంత్రం 4-00 గంటలకు దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో కో ఆప్షన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని అనంతరం దేవరకద్ర మండలం కు చెందిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారు. అని మండల అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ లు, వైస్ ఛైర్మన్ లు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ , ఐ ఎన్ టి యు సి సేవదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని మండల అధ్యక్షులు కోరారు.

# విద్యుత్ లైట్ ఏర్పాటు చేయండి..

దేవరకద్ర మే 28 నేషనలిస్ట్ వాయిస్

స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక వెలుగు ఆఫీస్ వెనుక భాగంలో గత వారం రోజుల నుంచి విద్యుత్ లైట్ లేక ఆ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఇంటికి వెళ్లాలంటే భయం గుప్పెట్లో వెళ్లవలసి వస్తుందని ప్రజలు అంటున్నారు. ఆ ప్రాంతంలో లైట్ లేకపోవడం వల్ల రాత్రి సమయంలో పాములు తిరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే లైట్ ఏర్పాటు చేసె విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# మహానుభావుడు ఎన్టీఆర్

## - తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి)





తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 28 (నేషనలిస్ట్ వాయిస్)

తెలుగు ప్రజల ఆరాధ్య దైవ్యం ఎన్టీఆర్ అని తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నంద మూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకుని నియోజక వర్గంలోని ఎన్టీఆర్ విగ్రహాలకు ఆయన గురువారం పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కేక్ కత్తిరించి నాయ కులకు తినిపించారు. అనంతరం నియోజకవర్గంలోని 11 క్లస్టర్లలో రెండు రోజులుగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి హాజరై నాయకులు, కార్యకర్తలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ రాజకీయ, సినీ రంగాన్ని శాశించిన ఘనత ఎన్టీఆర్ కే దక్కుతుందని కొనియాడారు. తెలుగు జాతి ఔనత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పటంతోపాటు తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుడు ఎన్టీఆర్ అని ప్రశంసించారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన నాయకుడిగా ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని స్లాఘించారు. ఎన్టీఆర్ చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రతీ సంవత్సరం తెదేపా మహానాడును అంగరంగవైభవంగా నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం సుభిక్షముగా ఉంటుందని తెలిపారు. పార్టీకి



కార్యకర్తలే వెన్నుముక అని, పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని వివరించారు. అనంతరం సీనియర్ నాయకులు, కార్యకర్తలను సాలువాతో సత్కరించారు. మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పెంటపాడు, రూరల్ అధ్యక్షులు , క్లస్టర్ యూనిట్ మరియు భూత్ ఇన్చార్జిలు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూన్ 2ను ఆర్టీసీ విలీనం డేగా ప్రకటించాలి

## - ఎంపిలను కలిసి విన్నవించిన జెఎసి నేతలు
## - ఆర్టీసీ విలీనంపై స్పష్టత కోరుతూ 1న ఇందిరాపార్క్ వద్ద దీక్ష
## - తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రకటన

హైదరాబాద్,మే28 (నేషనలిస్ట్ వాయిస్)



ఆర్టీసీ ఎన్నికల కంటే ముందుగానే జూన్ 2న విలీనం అపాయింటెడ్ డేట్ ను ప్రభుత్వం ప్రకటించాలని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ముఖ్యమంత్రి రాజకీయ ప్రధాన సలహాదారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి కి, ఎంపీ రఘురామ్‌రెడ్డిని జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ రవాణా శాఖ మంత్రి ఇటీవల ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికలు జరిగిన తరువాతనే విలీనం ప్రక్రియను ప్రారంభిస్తామని వెల్లడించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం తగిన నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, కో కన్వీనర్లు సుద్దాల సురేష్, యాదగిరి, బాబు, బుద్ధ విశాల్, రవికిరణ్ పాల్గొన్నారు.ఇదిలావుంటే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లుగా అపాయింటెడ్ డే ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 1వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సామూహిక దీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. యూనియన్ ఎన్నికలకు ముందుగా ఉద్యోగుల ప్రక్రియ పూర్తి చేయాలని.. 2026 మే 1 నుంచి అపాయింటెడ్ డే ప్రకటించాలని టీజేఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. అపాయింటెడ్ డే కంటే ముందుగా యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రకటించడంతో ఉద్యోగుల్లో అయోమయం నెలకొందని వారు అభిప్రాయపడ్డారు. జూన్ 1వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇందిరాపార్క్ వద్ద దీక్ష నిర్వహించనున్నట్లు టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్రకార్యదర్శి హనుమంతు ముదిరాజ్ తెలిపారు. ప్రభుత్వంలో విలీనం కోరుకునే ఉద్యోగులంతా యూనియన్లకు అతీతంగా ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షకు తెలంగాణ ఆర్టీసీ కార్మిక సమాఖ్య కూడా మద్దతు ప్రకటించింది. యాజమాన్యం వద్ద పరిష్కారం కావాల్సిన 29 సమస్యలపై చర్చలు కొనసాగుతున్న సమయంలో ఎన్నికలకు వెళ్లడం వల్ల కార్మికులు నష్టపోతారని కార్మిక సమాఖ్య నాయకులు కె.రాజిరెడ్డి తెలిపారు. విలీనం అనంతరం యూనియన్లు కొనసాగితే ఎన్నికల అంశాన్ని పరిశీలించాలని పేర్కొన్నారు. విలీనానికి సంబంధించిన విధివిధానాలు రూపొందించే కమిటీలో ప్రతి యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అపాయింటెడ్ డే ప్రకటించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

# కర్నాటకలో సిఎం పదవి మూన్నాళ్ల ముచ్చటే

## - ఐదేళ్లు నికరంగా పనిచేసిన వారు ముగ్గురే
## - ఒడిదుడుకుల రాజకీయంలో ఐదేళ్లు నిలబడని నేతలు

బెంగళూరు,మే28 (నేషనలిస్ట్ వాయిస్)

కర్ణాటకలో సీఎం మార్పుపై కొన్ని నెలలుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది. 2023లో ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన సిద్ధరామయ్య.. ఇప్పుడు ఆ కుర్చీని వదులుకోవడం ఖాయమయ్యింది. తన రాజీనామాను ఆయన గవర్నర్ కార్యదర్శికి అందచేశారు. దీంతో డికె శివకుఆర్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ ఇచ్చిన మాట ప్రకారం.. డీకే కొత్త సీఎంగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయనే ఖరారయితే ఆయన పదవిలో రెండేళ్లు మాత్రమే ఉంటారు. అసలు కర్ణాటకలో పూర్తి పదవీకాలం సీఎం సీటులో కొనసాగడం ఒక ఘనత అనే చెప్పవచ్చు. 1956 నుంచి కేవలం ముగ్గురు నేతలు మాత్రమే పూర్తికాలం పదవిలో కొనసాగారు. కాంగ్రెస్ నేత ఎస్. నిజలింగప్ప రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1956లో ఏడాదికిపైగా ఆ పదవిలో ఉన్న ఆయన.. 1962లో మరోసారి ఆ బాధ్యతలు స్వీకరించారు. 1968 వరకు అంటే ఐదేళ్ల 345 రోజులు అధికారంలో కొనసాగారు. అదేపార్టీకి చెందిన డి. దేవరాజ్ అర్స్ 1972 నుంచి 1977వరకు, తర్వాత సిద్ధరామయ్య 2013 నుంచి 2018 వరకు పూర్తికాలం ముఖ్యమంత్రులుగా కొనసాగారు. అయితే 1973 వరకు మైసూరు రాష్ట్రంగానే ఉండేది. అనంతరం కర్ణాటకగా పేరు మార్చారు. ఇదిలాఉంటే.. కర్ణాటకలో అతి తక్కువ కాలం పనిచేసిన ముఖ్యమంత్రులూ ఉన్నారు. ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాని సందర్భాల్లో ఎన్నికల అనంతరం పొత్తులు కుదిరినా.. అవి నిలబడలేదు. దాంతో ప్రభుత్వాలు కూలిన సందర్భాలున్నాయి. 2007లో యడియూరప్ప కేవలం వారం రోజులే సీఎం పదవిలో ఉన్నారు. భాజపా-జేడీఎస్ కూటమిలో సయోధ్య లేక ప్రభుత్వం కూలిపోయింది. వీరేంద్రపాటిల్ రాజీనామా చేయడంతో 1971లో కొన్నివారాల పాటు ఎస్ఆర్ కాంతి ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్-జేడీఎస్ నేతృత్వం కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో ధరమ్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఏడాదిపైగా ఆ కుర్చీలో కొనసాగినా.. కూటమిలోని వైరుధ్యాలతో ఆ ప్రయాణం సవ్యంగా సాగలేదు. దాంతో ఆయన 2006లో పదవిని కోల్పోయారు. పార్టీలో అంతర్గత రాజకీయాల కారణంగా భాజపా సదానందగౌడను పక్కనపెట్టడంతో 2012లో జగదీశ్ శెట్టర్ ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత అసెంబ్లీ గడువు ముగిసింది.

# ఎట్టకేలకు సిద్ధరామయ్య రాజీనామా

## - గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత
## - అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన
## - జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి

బెంగళూరు,మే28 (నేషనలిస్ట్ వాయిస్)



కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్ధరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనంతరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్ధరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించాను. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశాం. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి కోసం, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదని సిద్ధరామయ్య వివరించారు. ఈ క్రమంలో అధిష్టానంతో భేటీకి సిద్ధరామయ్య దిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

# నాలుగు రాష్ట్రాలకు బిజెపి అధ్యక్షుల నియామకం

న్యూఢిల్లీ,మే28 (నేషనలిస్ట్ వాయిస్)

భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు గురువారం పంజాబ్, హరియాణా, ఢిల్లీ, త్రిపుర రాష్ట్ర విభాగాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ వివరాలు వెల్లడించింది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రాను నియమించింది. పంజాబ్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కేవల్ సింగ్ ధిల్లాన్ పేరును ప్రకటించింది. హరియాణా అధ్యక్షురాలిగా అర్చనా గుప్తాను, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్ దేబ్‌రాయ్‌ను నియమించింది. తొలిసారి ఎంపీ అయిన హర్ష్ మల్హోత్రాకి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇచ్చింది. ప్రస్తుతం ఆయన కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్నారు. తూర్పు ఢిల్లీ నియోజకవర్గానికి హర్ష్ మల్హోత్రా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దేశ రాజధానిలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేందుకు మల్హోత్రాను అధ్యక్షుడిగా ప్రకటించారు.----

# బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న కోమటిరెడ్డి

నల్గొండ,మే28 (నేషనలిస్ట్ వాయిస్)

బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానించారు. నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో ముస్లిం సోదరులను కలిసి మాట్లాడారు. బక్రీద్ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని... ఇది మానవాళికి ఒక గొప్ప జీవన సందేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాలకు అతీతంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో' యాత్ర చేపట్టారని ప్రస్తావించారు. అన్నివర్గాలు, అన్నిమతాల ప్రజలు సమానమేనని, అందరు కలిసి మెలిసి ఉండాలనే గొప్ప సందేశంతో 'భారత్ జోడో' యాత్ర చేశారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అనడానికి ఇది ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. నల్గొండలో మతసామరస్యానికి, గంగా - జమునా - తెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

# కేరళంలో ఇడి అధికారులపై దాడి

## - 8మందిని అరెస్ట్ చేసినట్లు
## రాష్ట్ర డిజిపి వెల్లడి

తిరువనంతపురం,మే28 (నేషనలిస్ట్ వాయిస్)

కేరళం మాజీ సీఎం పినరయి విజయన్ నివాసంలో ఈడీ రెయిడ్స్ సందర్భంగా అధికారులపై దాడికి యత్నించిన 8 మందిని అరెస్టు చేశామని రాష్ట్ర పోలీస్ చీఫ్ ఎ. చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇతర నిందితులను ఇప్పటికే గుర్తించామని కూడా తెలిపారు. హోం మంత్రి రమేశ్ చెన్నితాలతో సమావేశం అనంతరం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి ఆదేశించారని అన్నారు. బుధవారం ఈడీ రెయిడ్స్ గురించి తెలియగానే భారీ స్థాయిలో పోలీసులను పంపించామని కూడా పోలీస్ చీఫ్ తెలిపారు. 'తాము వస్తున్నట్టు ఈడీ అధికారులు ముందుగా మాకు చెప్పలేదు. కానీ ఆపరేషన్ మొదలవగానే మేము భద్రత కోసం సెక్యూరిటీని పంపించాము' అని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకూ కేరళ పోలీసులు దాదాపు 300 మందిపై కేసులు పెట్టారు. అనుమతిలేకుండా గుమిగూడటం, ప్రభుత్వ అధికారులపై దాడి, అక్రమ నిర్బంధం, హత్యాయత్నం తదితర అభియోగాలతో కేసులు నమోదు చేశారు. మ్యూజియమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం, ఈడీ అధికారులపై నిందితులు కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో ఒక అధికారి చేయికి గాయమైంది. ఈడీ వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఈ దాడిలో కారు డ్రైవర్ కూడా గాయపడ్డారు. పరిస్థితి అదుపు చేసేందుకు ప్రయత్నించిన కేరళ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులను కూడా నిరసనకారులు టా÷-గ్గ౦÷ట్ చేశారు. నిరసన కారుల వల్ల దాదాపు రూ.3 లక్షల మేర నష్టం జరిగినట్టు తెలుస్తోంది. సీఎంఆర్ఎల్ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి మాజీ సీఎం పినరయి విజయన్, ఆయన కుటుంబసభ్యుల ఇళ్లల్లో ఈడీ బుధవారం ఈ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే.స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురై ఐదు కోచ్‌లు దహనమయ్యాయి.

# మధుబని రైల్వే స్టేషన్‌లో ప్రమాదం

## ఖాళీ బోగీలో చెలరేగిన మంటలు

పాట్నా,మే28 (నేషనలిస్ట్ వాయిస్)

బీహార్ మధుబని రైల్వే స్టేషన్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. జయనగర్-ఉద్నా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రైలు అగ్నిప్రమాదానికి గురైంది. ఓ ఖాళీ బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే బోగీ మొత్తం మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ప్లాట్‌ఫామ్ నంబర్-3పై షంటింగ్ పనుల నిమిత్తం రైలు నిలిచి ఉన్న సమయంలో ప్రమాదం జరిగింది. దీంతో అధికారులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మధుబని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో భయాందోళనలు నెలకొన్నాయి. రైల్వే సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సుమారు పది అగ్నిమాపక వాహనాలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాయి. గంటపాటు శ్రమించి వారు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంపై సమస్తిపూర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ జ్యోతి ప్రకాశ్ మిశ్రా స్పందించారు. రైల్వే యంత్రాంగం ప్లాట్‌ఫామ్ ప్రాంతాన్ని ఖాళీ చేయించి విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో అసాంఘిక శక్తుల ప్రమేయంపైనా ఆరా తీస్తున్నట్లు జ్యోతి ప్రకాశ్ మిశ్రా చెప్పారు. ఇదిలా ఉండగా.. 2022లో అదే ఎ÷-లాట్‌ఫామ్‌పై నిలిచి ఉన్న స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురై ఐదు కోచ్‌లు దహనమయ్యాయి.

# పార్టీలో మహిళా నాయకత్వానికి ప్రోత్సాహం

## పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలకు శ్రీకారం

## 11లక్షల మంది మహానాడు కోసం రిజిస్టర్ చేశారు

## మహానాడులో ఇష్టాగోష్టిగా మాట్లాడిన లోకేశ్

అమరావతి,మే28 (నేషనలిస్ట్ వాయిస్)



11 లక్షల మంది పార్టీ క్యాడర్ హాజరై.. మహానాడు మరో సంచలన రికార్డు నమోదు చేసుకుందని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ అటెండెన్స్‌లో వారంతా నమోదు చేయించుకున్నారని వివరించారు. గురువారం మహానాడులో మంత్రి లోకేశ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామన్నారు. పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచి పార్టీలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. పదవీకాల పరిమితిని తీసుకు వచ్చింది తామేనని ఈ సందర్భంగా నారా లోకేశ్ గుర్తు చేశారు. ఎన్నికల గురించి కాదు.. సిద్ధాంతపరంగా తాము సంస్కరణలు తీసుకువస్తున్నామని చెప్పారు. గత మహానాడులో తాను ఆరు శాసనాలు గురించి చెప్పానని ఈ సందర్భంగా నారా లోకేశ్ గుర్తు చేశారు. ఇప్పుడు 'నా తెలుగుదేశం.. నా బాధ్యత' అని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎవరైనా తన ప్రసంగం ముందు నా తెలుగుదేశం.. నా బాధ్యత అని చెప్పాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఆలోచించి అందుకు అనుగుణంగా తాము ముందుకు వెళ్లాల్సిఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌లాగా తాము ఏకపక్షంగా ఏకగ్రీవాలు చేసుకోమని చెప్పారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తామన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికలలో నామినేషన్ల పేపర్లు లాక్కుని ఎలా వ్యవహరించారనేది అందరం చూశామన్నారు. అందుకనే ఆయన ఏకగ్రీవాలు చేస్తే ఊరుకోమన్నారని చెబుతున్నారని తెలిపారు. నాడు ఆయన చేశాడు కాబట్టే నేడు భయపడుతున్నారంటూ జగన్ వైఖరిని ఈ సందర్భంగా లోకేశ్ ఎండగట్టారు. డీఎస్సీ పరీక్షలు, నియామకాలు పూర్తయిన ఆరు నెలలు తర్వాత అందులో అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించడం ఏమిటని నారా లోకేశ్ సందేహం వ్యక్తం చేశారు. ఆయనకు ఇప్పుడు ట్యూబ్ లైట్ వెలిగినట్లుందంటూ వ్యంగ్యంగా అన్నారు. అప్పట్లోనే కోర్టులో డీఎస్సీపై జగన్ ఎన్నో కేసులు వేయించారని గుర్తు చేశారు. అన్ని పిటిషన్లను కోర్టు కొట్టివేసిందని.. కానీ మమ్మల్ని ఎక్కడా తప్పు పట్టలేదని నారా లోకేశ్ వివరించారు. ఈ అంశంపై దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు తాను సవాల్ విసిరానని లోకేశ్ గుర్తు చేశారు. దీనిపై జగన్ స్పందిస్తే బాగుంటుందన్నారు. ఒక్క టీచర్ కానీ.. అధికారి కానీ డీఎస్సీపై ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. డీఎస్సీపై నాకు కానీ, ఏ అధికారికి గానీ ఒక్క రూపాయి అయినా ఇచ్చినట్లు నిరూపించాలని జగన్ పార్టీలోని నేతలను ఈ సందర్భంగా లోకేశ్ డిమాండ్ చేశారు. లెవన్ టీమ్ కెప్టెన్‌కు దమ్ముంటే నిరూపించాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు లోకేశ్ సూటిగా సవాల్ విసిరారు. జగన్.. ఆయన కుటుంబ చరిత్రను తవ్వి తీయించారన్నారు. రాజారెడ్డి చేసిన అరాచకాలు, బైరైటీస్ గనుల కోసం వాళ్లు ఎంతమందిని హత్య చేశారనేది జనానికి తెలియచేసిన ఘనత వైఎస్ జగన్‌దేనని ఈ సందర్భంగా నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. తాను వైఎస్ జగన్ కాదని.. ఆయన లాగా తన వద్ద గొడ్డలి లేదంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎంను ఉద్దేశించి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# పెట్రో ధరలతో సామాన్యులపై భారం

## రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి లెఫ్ట్ సిద్ధం

## జూన్1 నుంచి 7 వరకు

## ప్రజాచైతన్య కార్యక్రమం

విజయవాడ,మే28 (నేషనలిస్ట్ వాయిస్)

క్రమంగా పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్, సీఎన్‌జీ ధరలు.. సామాన్యులకు భారంగా మారుతున్నాయి.. దీనితో అన్ని వస్తువులపై వీటి ప్రభావం పడుతోంది.. విజయవాడలో వామపక్ష పార్టీలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. సామాన్య ప్రజలపై పెరుగుతున్న ఇంధన భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ పలు దశల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. లెఫ్ట్ పార్టీల ప్రెస్ మీట్‌లో మీడియాతో మాట్లాడిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు.. రోజురోజుకీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరుగుతుం డటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక పన్నుల వల్లే ఇంధన ధరలు భారీగా పెరుగుతున్నాయని విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూన్ 1 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వామపక్ష నేతలు వెల్లడించారు. అనంతరం జూన్ 9న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంగా పాసర్లపూడిలోని కేజీ బేసిన్ ప్రాంతాన్ని కూడా సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రోజూ పెట్టుబడులు, కంపెనీలు, ఉద్యోగాల పేరుతో ప్రకటనలు చేస్తూ హడావిడి చేస్తున్నారని, కానీ ధరల పెరుగుదల వల్ల ఎంత మంది ఉపాధి కోల్పోయారో లెక్కలు చెప్పాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ధరలు తగ్గించకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకు పొదుపు చర్యల పేరుతో ప్రభుత్వం ప్రచారం చేస్తోందని ఆరోపించారు. పొదుపు చర్యలను ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబులే పాటించడం లేదని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేసిన వామపక్ష నేతలు, ఇప్పుడు ఎందుకు ఆ హామీలను అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించిన టీడీపీ నేతలు, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు తగ్గించకపోవడం ఏమిటని నిలదీశారు. అంతే కాదు.. పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నులను తక్షణమే తగ్గించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. అలాగే మహానాడులోనే ఇంధన ధరల తగ్గింపుపై తీర్మానం చేయాలని కోరాయి.. కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే వనరుల్లో 50 శాతం రాష్ట్ర ప్రజల అవసరాలకు వినియోగించేలా ప్రకటన చేయాలని డిమాండ్ చేశాయి. అలాగే కమర్షియల్ గ్యాస్ ధరలను పాత ధరలకే అందించాలని ప్రభుత్వాన్ని కోరాయి. ఇంధన ధరల పెరుగుదలతో సామాన్యులు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని, వెంటనే కేంద్రం మరియు రాష్ట్రం ప్రజలకు ఊరట కలిగించే చర్యలు తీసుకోవాలని వామపక్ష పార్టీలు స్పష్టం చేశాయి.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

## గొల్లపూడిలో ఎన్టీఆర్ విహానికి దేవినేని నివాళి

## ఆత్మగౌరవాన్ని ప రిచయం చేసిన మహానేత అని అంజలి

విజయవాడ,మే28 (నేషనలిస్ట్ వాయిస్)



మాజీ సీఎం నందమూరి తారక రామారావు 103వ జయంతిని గొల్లపూడిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొని నివాళులు అర్పించారు. ఎన్టీఆర్‌కు పూలమాలవేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడారు. ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు ఎన్టీఆర్ అని కీర్తించారు. రాముడుగా, కృష్ణుడుగా చెరగని ముద్ర వేసి రాజకీయ రంగంలో ధ్రువతారగా వెలిగారని ప్రశంసించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న



తెలుగువారందరికీ 'ఆత్మగౌరవాన్ని' పరిచయం చేసిన ధీరుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కేవలం పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడని ఉద్ఘాటించారు. టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయకత్వంలో పార్టీని కాపాడి.. 44 ఏళ్లుగా బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారని దేవినేని ఉమ వ్యాఖ్యానించారు. 1994లో ఎన్టీఆర్ నాయకత్వంలో టీడీపీ ఘన విజయం సాధించడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 'మీకోసం వస్తున్నా' పాదయాత్రతో చంద్రబాబు ప్రజల్లోకి వెళ్లి 2014లో టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చారని ప్రస్తావించారు. అసత్య ప్రచారాలతో వచ్చిన వైసీపీని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని విమర్శించారు. గుడివాడ వైసీపీ నేతలు ఇప్పటికీ అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మహిళలను అవమానించిన, దుర్భాషలాడిన వైసీపీ నేతలకు ప్రజలే గట్టి బుద్ధి చెప్పారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని ఉద్ఘాటించారు. కూటమి ప్రభుత్వం 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి.. 23 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు వెళ్తోందని దేవినేని ఉమ తెలిపారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవ నినాదాన్ని, చంద్రబాబు ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతికి చాటారని వెల్లడించారు. యువగళం ద్వారా లోకేశ్ మూడోతరం నాయకత్వాన్ని నిరూపించుకుని పార్టీని విజయపథంలో నడిపిస్తున్నారని చెప్పారు. నందమూరి బాలకృష్ణ హిందూపురంలో అభివృద్ధి పనులు, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా మరిన్ని సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. నారా భువనేశ్వరి ఆధ్వర్యంలోని ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్య, ఆరోగ్యం, బ్లడ్ బ్యాంక్, సంజీవని వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సమన్వయంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

# మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, బూతునాడు

## - టీడీపీని చెప్పల పార్టీ, వెన్నుపోటు పార్టీ, దొంగల పార్టీ

## - తల్లి, చెల్లి, గొడ్డలి అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు

## - తెలుగుదేశంపై మాజీమంత్రి రోజా ఘాటు విమర్శలు

తిరుపతి,మే28 (నేషనలిస్ట్ వాయిస్)




తెలుగుదేశం పార్టీ, మహానాడుపై మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు .. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆమె.. టీడీపీ, సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.. టీడీపీ నిర్వహిస్తున్న మహానాడును లక్ష్యంగా చేసుకుని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. టీడీపీ ఒక 'బోగస్ పార్టీ' అంటూ వ్యాఖ్యానించిన రోజా, ఆ పార్టీకి కోటి మంది సభ్యులు ఉన్నారని చెప్పుకుంటున్నప్పటికీ మహానాడును చూస్తే రాష్ట్రంలో ఎక్కడా ఉత్సాహం కనిపించడం లేదన్నారు. మహానాడు అట్టర్ ఫ్లాప్ అయ్యింది. అందుకే రికార్డ్ డ్యాన్సులు వేసి పార్టీ క్యాడర్‌ను కూర్చోబెడుతున్నారని అంటూ ఎద్దేవా చేశారు. మహానాడును ఉద్దేశించి 'ఇది మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, భూతునాడు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సూపర్ సిక్స్ హామీల గురించి ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పకుండా తల్లి, చెల్లి, గొడ్డలి అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇక, చంద్రబాబు.. హెరిటేజ్ ఆస్తుల్లో తన తల్లి, చెల్లికి ఎంత ఆస్తులు ఇచ్చారో చెప్పగలరా అని రోజా ప్రశ్నించారు. వాళ్లు ఎక్కడ ఉన్నారో కూడా ప్రజలకు తెలియదు. తల్లికి, చెల్లికి సహాయం చేసినట్టు ఒక్క ఫోటో అయినా చూపించగలరా అని విమర్శించారు. ఈ దేశంలో జగన్ తన చెల్లికి ఇచ్చినంత ఆస్తులు మరెవ్వరూ ఇవ్వలేదని రోజా వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసుపై కూడా రోజా స్పందించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే వివేకా హత్య జరిగిందని గుర్తుచేస్తూ, అప్పట్లో నిందితులను ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్నించారు. వివేకా కేసులో నిందితుడైన దస్తగిరికి టీడీపీ మద్దతు ఇస్తోందని ఆరోపించారు. చంద్రబాబు కేసులు వాదించే లాయరే ప్రస్తుతం దస్తగిరికి లాయర్‌గా ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీని చెప్పుల పార్టీ, వెన్నుపోటు పార్టీ, దొంగల పార్టీ అంటూ రోజా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించారని, వెన్నుపోటు పొడిచారని, ఆయన పార్టీని దొంగతనంగా లాక్కున్నారని ఆరోపించారు. పెద్ద ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. చిన్న ఎన్టీఆర్‌కు లోకేష్ వెన్నుపోటు పొడవలేదా? అంటూ ప్రశ్నించారు. అలాగే పవన్ కల్యాణ్ తల్లిని తిట్టించింది కూడా లోకేష్ కాదా అని ప్రశ్నించారు. మరోవైపు.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తామని లోకేష్ చెబుతున్నారని, అయితే అది కేవలం డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమేనని రోజా విమర్శించారు. టీడీపీకి నిజంగా దమ్ముంటే మహానాడులో 33 శాతం మహిళా రిజర్వేషన్‌పై తీర్మానం చేయాలి. బీజేపీ మహిళా బిల్లును అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని కూలదోస్తామని చెప్పగలరా?' అని ఆమె సవాల్ విసిరారు. జగన్ ఇప్పటికే 2023 అసెంబ్లీలో మహిళా బిల్లుపై తీర్మానం చేశారని, స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఎప్పుడో ప్రకటించారని రోజా తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి టీడీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని రోజా ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలను చంద్రబాబు అడ్డదిడ్డంగా పెంచుతున్నారని విమర్శించారు. పేదలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చెప్పే చంద్రబాబు, తన కుటుంబంలో మాత్రం ఒక్కో పిల్లవాడినే కనారని ఎద్దేవా చేశారు. లోకేష్‌పై కూడా రోజా తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, 'జూమ్ మీటింగ్‌లో కొడాలి నాని, వల్లభనేని వంశీ వస్తే భయపడి పారిపోయిన వ్యక్తి లోకేష్' అని విమర్శించారు. అలాగే జగన్ పీఏ కేఎన్ఆర్‌ను విచారణ పేరుతో వేధిస్తున్నారని ఆరోపిస్తూ, వైసీపీ నేతలపై కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయని రోజా మండిపడ్డారు.

# ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి

## - నివాళి అర్పించిన టిడిపినేతలు, కుటుంబ సభ్యులు

హైదరాబాద్,మే28 (నేషనలిస్ట్ వాయిస్)



దివంగత మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడు, సినీ దిగ్గజం నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్ సమీపంలోని ఎన్టీఆర్ గా÷-డ్గ÷న్ వద్ద ఈరోజు (గురువారం) ఆయనకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, సినీ ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. కటుఉంబ సభ్యులు పలుఉవరు వచ్చి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో ఎన్టీఆర్ గార్డెన్‌కు చేరుకుని, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి వినమ్రంగా నమస్కరించారు. జూనియర్ ఎన్టీఆర్ రాకతో అక్కడ ఒక్కసారిగా అభిమానుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. తెల్లవారుజామునే భారీ సంఖ్యలో అభిమానులు ఎన్టీఆర్ గా÷-డ్గ÷న్ వద్దకు చేరుకొని తమ అభిమాన నటుడిని చూసేందుకు పోటీ పడ్డారు. 'జై ఎన్టీఆర్ అంటూ అభిమానుల నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు అభివాదం చేస్తూ కాసేపు అక్కడ గడిపారు. ఆయన రాకతో ఎన్టీఆర్ జయంతి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది. జూనియర్ ఎన్టీఆర్ రావడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అభిమానుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్యాంక్ బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేశారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత అని టీడీపీ నేతలు కొనియాడారు. సినీరంగంలో ఎన్నో చారిత్రక పాత్రలు పోషించి కోట్లాది అభిమానులను సంపాదించు కున్నారని కీర్తించారు. రాజకీయాల్లో కూడా తనదైన ముద్ర వేశారని ప్రశంసించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించి ప్రజలకు సంక్షేమ పాలన అందించిన నాయకుడిగా ఎన్టీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందని వ్యాఖ్యానించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏడాది జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని టీడీపీ నేతలు తెలిపారు. ఏడాది 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నామని చెప్పారు. పేదలకు అన్నదానాలు, రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేశామని టీడీపీ నేతలు వివరించారు. ఈ సందర్భంగా అభిమానులు ఎన్టీఆర్ సేవలను, జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. నివాళి అర్పించన వారిలో నారా భువనేశ్వరి, నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు ఒకప్పటి టిడిపి నేతలు నాగం జనార్ధన్ రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, పెద్దిరెడ్డి, మండవ వెంకటేశ్వర రావు తదితరులు నివాళి అర్పించారు.



# హార్దిక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ డిలీట్

సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా షాకింగ్ డెసిషన్ తీసుకున్నాడు. బుధవారం సాయంత్రం ఆయన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ అకస్మాత్తుగా కనిపించకుండా పోయింది. హార్దిక్ పేజీని ఓపెన్ చేస్తే "సారీ, ఈ పేజీ అందుబాటులో లేదు" అనే మెసేజ్ వస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 40 మిలియన్లకు పైగా ఫాలోవర్లను కలిగిన ఆయన అకౌంట్ డిలీట్ కావడం వెనుక ఐపీఎల్ 2026 వైఫల్యాలే కారణమని తెలుస్తోంది. ఈ సీజన్ లో ఐదుసార్లు ఛాంపియన్స్ అయిన ముంబై టీమ్ దారుణంగా విఫలమైంది. లీగ్ స్టేజ్ లో ఆడిన 14 మ్యాచ్‌ల్లో కేవలం 4 విజయాలు మాత్రమే సాధించి పాయింట్ల పట్టికలో 9వ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ సీజన్ ముంబై ఇండియన్స్ జట్టుకే కాకుండా హార్దిక్ పాండ్యాకు వ్యక్తిగతంగా కూడా చాలా నిరాశాజనకంగా సాగింది. గాయాలు, ఫామ్ లేమితో ఇబ్బంది పడిన ఆయన ఆడిన 8 ఇన్నింగ్స్‌లలో కేవలం 146 పరుగులు మాత్రమే చేయగలిగాడు. బౌలింగ్‌లోనూ పెద్దగా ఇంపాక్ట్ చూపించలేక కేవలం 3 వికెట్లు మాత్రమే పడగొట్టారు. కెప్టెన్ గా, ప్లేయర్ గా ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఆయనపై విపరీతమైన ట్రోలింగ్ జరిగింది. ఈ మానసిక ఒత్తిడిని తట్టుకోలేకనే ఆయన ఇన్‌స్టాగ్రామ్ నుండి తప్పుకుని ఉంటారని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.టీమిండియా మాజీ బ్యాటర్ వసీం జాఫర్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ముంబై ఇండియన్స్ ఫ్యూచర్ ప్లాన్స్ పై స్పందించాడు. వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్ లో హార్దిక్ పాండ్యాను ముంబై కెప్టెన్‌గా కొనసాగించడం తనకు ఇష్టం లేదని ఓపెన్‌గా చెప్పాడు. అయితే ఫ్రాంచైజీ ఆయనను జట్టులోనే రీటైన్ చేసుకోవాలని సూచించాడు. కెప్టెన్సీ ప్రెజర్ లేకపోతే హార్దిక్ తన పర్సనల్ గేమ్ పై ఫోకస్ పెట్టి బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇవ్వగలరని అభిప్రాయపడ్డాడు. హార్దిక్ ప్లేస్ లో కొత్త కెప్టెన్ ఎవరనే ప్రశ్నకు, ఈ స్టేజ్ లో ముంబైకి కొత్త లీడర్‌ను ఎంపిక చేయడం అంత ఈజీ కాదన్నాడు.మొత్తం 10 జట్లు ఉన్న ఐపీఎల్ పాయింట్ల పట్టికలో ముంబై ఇండియన్స్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. లక్నో సూపర్ జైంట్స్ కంటే మాత్రమే ముంబై మెరుగ్గా ఉంది. తమ ఆఖరి లీగ్ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో 30 పరుగుల తేడాతో ఓడిపోవడంతో ఈ సీజన్ లో ముంబైకి ఇది 10వ ఓటమిగా నమోదైంది.



## క్రిస్ గేల్ వరల్డ్ రికార్డు బద్దలు కొట్టిన వైభవ్

ఐపీఎల్ 2026 ఎలిమినేటర్ మ్యాచ్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పై రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత బ్యాటింగ్ తో హిస్టరీ క్రియేట్ చేశారు. ఈ మ్యాచ్ లో కేవలం 29 బంతుల్లోనే 12 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. ఈ ఇన్నింగ్స్ తో ఒకే ఐపీఎల్ సీజన్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ప్లేయర్‌గా వెస్టిండీస్ లెజెండ్ క్రిస్ గేల్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. గేల్ 2012 సీజన్ లో 59 సిక్సర్లు కొట్టగా, సూర్యవంశీ ఆ మార్కును ఈజీగా దాటేశాడు. స్టేడియం స్క్రీన్ పై ఆయనను "యూనివర్స్ బేబీ బాస్" అని సంబోధించడం విశేషం. ఈ మ్యాచ్ లో సూర్యవంశీ కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఐపీఎల్ నాకౌట్ లేదా ప్లేఆఫ్స్ హిస్టరీలో సురేష్ రైనా పేరిట ఉన్న ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును ఆయన సమం చేశాడు. కేవలం ఒకే ఒక్క బంతి తేడాతో క్రిస్ గేల్ పేరిట ఉన్న ఐపీఎల్ ఫాస్టెస్ట్ సెంచరీ (30 బంతుల్లో) రికార్డును మిస్ చేసుకున్నాడు. 20 లోపు బంతుల్లో అత్యధిక సార్లు యాభై పరుగులు చేసిన జాబితాలో 5 సార్లతో నికోలస్ పూరన్ సరసన నిలిచాడు. అలాగే పవర్‌ప్లే లోనే అత్యధిక సిక్సర్లు (8 సిక్సర్లు) బాదిన సరికొత్త రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ 15 ఏళ్ల వండర్ కిడ్ అసాధారణ పర్ఫార్మెన్స్ చూసి ఆయనను సీనియర్ ఇండియన్ మెన్స్ టీమ్‌లోకి సెలెక్ట్ చేయాలనే డిమాండ్ క్రికెట్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఐపీఎల్ డెబ్యూ చేసిన ఏడాది లోపే ఈ రేంజ్ లో ఆడటంతో ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. వచ్చే నెలలోనే తిలక్ వర్మ కెప్టెన్సీలోని ఇండియా-ఎ టీమ్ తరఫున శ్రీలంకలో జరిగే ట్రై-సిరీస్ లో సూర్యవంశీ బరిలోకి దిగనున్నాడు. సూర్యవంశీ ఫ్యూచర్ పై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ స్పందిస్తూ ఆయనను ఒక 'స్పెషల్ టాలెంట్' గా అభివర్ణించారు. భవిష్యత్తులో సూర్యవంశీ లాంటి ప్లేయర్లను బీసీసీఐ, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలు సరైన దారిలో గైడ్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేవలం ఫిజికల్ స్కిల్స్ మాత్రమే కాకుండా మెంటల్ టఫ్నెస్ కూడా స్పోర్ట్స్ లో చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ అద్భుతమైన టాలెంట్ రాబోయే రోజుల్లో టీమిండియా తరఫున ఎన్నో ఏళ్ల పాటు సేవలు అందించేలా తాము పూర్తి సపోర్ట్ అందిస్తామని ధుమాల్ కన్ఫర్మ్ చేశారు.




## జైస్వాల్? వెంటనే రాజస్థాన్?ను వీడాలి మాజీ క్రికెటర్ అంబటి రాయుడు కీలక వ్యాఖ్యలు

రాజస్థాన్ రాయల్స్ ఈ సీజన్?లో క్వాలిఫయర్? 2 దాకా వెళ్లడంలో యువ క్రికెటర్? వైభవ్ సూర్యవంశీ కీలక పాత్ర పోషించాడనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే తనతోపాటు ఓపెనింగ్? చేస్తున్న యశస్వీ జైస్వాల్ కూడా ప్రస్తుత సీజన్?లో మంచి ఇన్నింగ్సులే ఆడాడు. 15 మ్యాచ్?ల్లో 426 పరుగులు చేశాడు. స్ట్రైక్? రేట్ 150ం ఉంది. ఈ గణాంకాలు చూస్తే ఒక ప్లేయర్?కు ఇది బెటర్? సీజనే అని చెప్పవచ్చు. కానీ వైభవ్ తుఫాన్ ఇన్నింగ్స్?లు, రికార్డుల మధ్య జైస్వాల్ ఆటకు దక్కాల్సిన ప్రాధాన్యం దక్కడంలేదు. దీనిపై మాజీ క్రికెటర్ అంబటి రాయుడు కీలక వ్యాఖ్యలు చేశాడు. జైస్వాల్?కు క్రిడిట్ దక్కాలంటే అతడు రాజస్థాన్ జట్టును వీడాలని అభిప్రాయపడ్డాడు. 2020 నుంచి జైస్వాల్ ఐపీఎల్?లో రాజస్థాన్? జట్టుకే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇప్పటివరకు 82 మ్యాచ్‌లు ఆడి 2592 పరుగులు సాధించాడు. ఈ సీజన్?లో 426 పరుగులు చేయడమే కాకుండా రెండు మ్యాచ్?ల్లో జట్టుకు కెప్టెన్?గానూ వ్యవహరించాడు. అయితే జైస్వాల్ తన సొంత మార్క్? చూపించుకోవాలంటే రాజస్థాన్ నుంచి బయటకు రావాలని రాయుడు అన్నారు. వైభవ్ రాణించడంతో జైస్వాల్?కు తగిన గుర్తింపు దక్కడం లేదని అభిప్రాయపడ్డాడు. అతడు ఏ జట్టులోనైనా మ్యాచ్? విన్నర్?గా రాణించగడలని పేర్కొన్నాడు. అందుకే వైభవ్ షాడో (నీడ)లో జైస్వాల్ ఉండకూడదని అన్నాడు. ఈ మేరకు ప్రముఖ స్పోర్ట్స్ వెబ్?సైట్ ఈఎస్?పీఎన్? తో వ్యాఖ్యానించాడు. 'ఎప్పుడు కూడా వైభవ్? నీడలో జైస్వాల్ ఉండకూడదు. జైస్వాల్ ఏ జట్టులో ఉన్నా మ్యాచ్? విన్నర్?గా రాణించగలడు. రానున్న రోజుల్లో వైభవ్ ఇతర ఆటగాళ్లను ఓవర్? షాడో చేస్తూనే ఉంటాడు. అందుకే తనతో పోటీ లేని ఇంకో ఆటగాడితో జైస్వాల్ ఓపెనింగ్ చేస్తే బాగుంటుంది. అలా జరగాలంటే అతడు రాజస్థాన్?లోంచి బయటకు వచ్చి వేరే జట్టులో చేరాలి. ఎందుకంటే వైభవ్?తో కలిసి బ్యాటింగ్ చేస్తూ ప్రతీసారి అతడి నీడలోనే ఉండిపోవాలంటే ఎవరికైనా కష్టమే. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న స్టార్ క్రికెటర్ జైస్వాల్. అతను వేరే జట్టుకు వెళితే, తనంతట తానుగా మ్యాచ్‌లు గెలిపిస్తాడు. అతనికి ఆ స్వేచ్ఛ, ఆ ప్లాట్?ఫామ్ అవసరం. ఎందుకంటే వైభవ్? ఇతర ప్లేయర్లను కూడా డామినేట్ చేస్తూనే ఉంటాడు. కాబట్టి అతడితో ఓ సీనియర్ బ్యాటర్? ఓపెనింగ్?కు రావాలి. అతడు వైభవ్ నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకొని, అతని విజయం పట్ల సంతోషించాలి. అంతేకానీ నాన్ స్ట్రైకర్ ఎండ్?లో ఉన్న బ్యాటర్?తో పోటీ పడకూడదు' అని రాయుడు అన్నాడు.ఒకవేళ జైస్వాల్ వేలంలోకి వస్తే అనేక ఫ్రాంచైజీలు అతడి కోసం పోటీ పడే అవకాశం ఉంటుంది. కానీ అతడికి మాత్రం ముంబయి ఇండియన్స్ జట్టు సూట్ అవుతుందని రాయుడు అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం జట్టులో స్టార్ ప్లేయర్ ఓపెనర్ రోహిత్ శర్మ కెరీర్ చివరి దశకు చేరుకుంటున్నందున, ముంబయికి జైస్వాల్ మంచి ఓపెనర్?గా సెట్ అయ్యే ఛాన్స్ ఉంటుందని అన్నాడు.




## ఐపీఎల్‌లో హనీ ట్రాప్ కలకలం..

ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ.. తెరవెనుక వివాదాలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో ఉపయోగించిన హనీ-ట్రాప్ అనే పదం క్రికెట్ వర్గాల్లో పెద్ద దుమారానికి కారణమైంది. ఈ వ్యాఖ్యలు బయటకు రాగానే సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేశాయి. కొందరు ఆకతాయిలు ఏకంగా ఐపీఎల్ క్రికెటర్ల భార్యలు, పార్ట్‌నర్లను టార్గెట్ చేస్తూ ట్రోలింగ్, వేధింపులకు దిగడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ వివాదంపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ తాజాగా స్పందిస్తూ కీలక వివరణ ఇచ్చారు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్లో ఎలాంటి హనీ-ట్రాపింగ్ ఉదంతాలు తమ దృష్టికి రాలేదని ఆయన స్పష్టం చేశారు. ఐపీఎల్ అనేది అత్యంత పారదర్శకంగా, స్వచ్ఛంగా సాగుతున్న టోర్నమెంట్ అని, ఇలాంటి లేనిపోని పుకార్లను నమ్మవద్దని ఆయన అభిమానులను కోరారు. అయితే ఈ సీజన్లో ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్, ఫ్రాంచైజీల మేనేజ్‌మెంట్ వైపు నుంచి కొన్ని క్రమశిక్షణా ఉల్లంఘనలు, ప్రోటోకాల్ వివాదాలు జరిగిన మాట నిజమేనని బీసీసీఐ అంగీకరించింది. ఇలాంటి సంఘటనలను ముందే అరికట్టకపోతే టోర్నమెంట్‌తో పాటు బోర్డు ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా 10 ఐపీఎల్ ఫ్రాంచైజీల సీఈఓలకు ఒక సుదీర్ఘమైన హెచ్చరిక లేఖ రాశారు. ఆటగాళ్ల భద్రత, లీగల్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని అపరిచిత వ్యక్తులను హోటల్ గదుల్లోకి రానివ్వకూడదని, యాంటీ కరప్షన్ ప్రోటోకాల్స్ కచ్చితంగా పాటించాలని అందులో ఆదేశించారు.



## పరిస్థితులను అంచనా వేయకపోవడంతో

## భారీ మూల్యం

ఐపీఎల్ 2026 సీజన్‌లో లీగ్ దశ అంతా దూసుకెళ్లిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు.. ప్లేఆఫ్స్‌లో మాత్రం తీవ్ర నిరాశ కలిగించింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో 47 పరుగుల తేడాతో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. సీజన్ మొత్తం దూకుడైన ఆటతో టైటిల్ ఫేవరెట్‌గా గుర్తింపు పొందిన ఆరెంజ్ ఆర్మీ.. కీలక సమయంలో తడబడటం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ముఖ్యంగా జట్టు తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు, బౌలింగ్ వైఫల్యం, టాప్ ఆర్డర్ కుప్పకూలడం ఈ ఓటమికి ప్రధాన కారణాలుగా కనిపించాయి. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఈ హై టెన్షన్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ కెప్టెన్ పాట్ కమిన్స్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే పిచ్ పరిస్థితులను సరిగా అంచనా వేయకపోవడం జట్టుకు భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. బ్యాటింగ్‌కు అనుకూలంగా మారిన పిచ్‌పై రాజస్థాన్ బ్యాటర్లు హైదరాబాద్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. ప్రత్యేకంగా 15 ఏళ్ల యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ సంచలన ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు చేసి హైదరాబాద్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతని ఇన్నింగ్స్‌లో 12 భారీ సిక్సర్లు, 5 ఫోర్లు ఉండటం విశేషం. మరోవైపు ధృవ్ జురెల్ అర్ధశతకంతో జట్టుకు బలమైన మద్దతు ఇచ్చాడు. ఈ ఇద్దరి దూకుడు కారణంగా రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. హైదరాబాద్ బౌలర్లు మ్యాచ్ మొత్తం లైన్ అండ్ లెంగ్త్ కోల్పోయి పరుగులు ధారాళంగా సమర్పించుకున్నారు. కెప్టెన్ పాట్ కమిన్స్ నాలుగు ఓవర్లలో వికెట్ తీయకుండానే 64 పరుగులు ఇచ్చాడు. సాకిబ్ హుస్సేన్ కూడా భారీగా పరుగులు సమర్పించాడు. ప్రఫుల్ హింగే మూడు వికెట్లు తీసినప్పటికీ అతని ఎకానమీ జట్టుకు నష్టం కలిగించింది.




# సందీప్ సినిమాల్లో హీరోయిన్లది భావోద్వేగ పాత్ర స్పిరిట్‌లోనూ అదే కనిపిస్తుందనన్న దర్శకుడు హేమంత్


పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. అయితే తాజాగా ప్రముఖ దర్శకుడు హేమంత్ మధుకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో హీరోయిన్ పాత్రల గురించి మాట్లాడిన హేమంత్ మధుకర్.. ఆయన సినిమాల్లో కనిపించే రొమాంటిక్ సన్నివేశాలను చూసి హీరోయిన్లకు కేవలం గ్లామర్ పాత్రలే ఉంటాయని అనుకోవడం తప్పని అన్నారు. సందీప్ తన కథల్లో మహిళా పాత్రలను చాలా బలంగా, భావోద్వేగాలకు దగ్గరగా రాస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'అర్జున్ రెడ్డి'లో శాలినీ పాండే పోషించిన ప్రీతి పాత్రను, అలాగే 'యానిమల్'లో రష్మిక మందన్న చేసిన గీతాంజలి పాత్రను ఉదాహరణగా చెప్పారు. ఆ పాత్రలు కేవలం హీరోకు జోడీగా మాత్రమే కాకుండా కథలో కీలకమైన భావోద్వేగ బలాన్ని ఇచ్చాయని అన్నారు. త్రిప్తి దిమ్రి ఎంపికపై కూడా హేమంత్ స్పందించారు. నటీనటుల మధ్య పోలికలు పెట్టడం సరికాదని, ప్రతి పాత్రకు తగిన నటుడిని లేదా నటిని దర్శకుడు ఎంపిక చేస్తాడని చెప్పారు. 'స్పిరిట్'లోని పాత్రకు త్రిప్తి దిమ్రి పూర్తిగా సూట్ అవుతుందని భావించి సందీప్ ఆమెను ఎంపిక చేశారని వెల్లడించారు. అంతేకాదు, ఈ సినిమాలో త్రిప్తి నటన ప్రేక్షకుల అంచనాలను మించేలా ఉంటుందని హేమంత్ మధుకర్ ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే 'యానిమల్' సినిమాతో త్రిప్తి దిమ్రికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు ప్రభాస్ సరసన 'స్పిరిట్'లో నటించడం ఆమె కెరీర్‌లో మరో కీలక మలుపుగా మారనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక 'స్పిరిట్' సినిమా విషయానికి వస్తే.. ఇది పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సందీప్ రెడ్డి వంగా స్టైల్‌లో యాక్షన్, ఎమోషన్, ఇంటెన్స్ డ్రామాతో ఈ సినిమా రూపొందనుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం.

# సింగిల్ మదర్‌గా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్




24 ఏళ్ల వయసులో పెద్ద కుమార్తె రెనీని దత్తత తీసుకున్నప్పుడు ఎదుర్కొన్న విమర్శలను, ఇబ్బందులను బాలీవుడ్ నటి, మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ తాజాగా గుర్తుచేసుకుంది. ఒక సింగిల్ మదర్‌గా తల్లి కావాలనే తన నిర్ణయం వల్ల కెరీర్ ముగిసిపోతుందని అందరూ భావించారని, చివరికి తన మేనేజర్ కూడా తనను వదిలేసి వెళ్లిపోయాడని ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సుస్మితా సేన్ మాట్లాడుతూ.. 'నేను రెనీని దత్తత తీసుకున్నప్పుడు నా మేనేజర్ నన్ను వదిలి పారిపోయాడు. 'నీకు కెరీర్ పట్ల సీరియస్ నెస్ లేదు.. 24 ఏళ్లకే తల్లి అయిన వ్యక్తికి నేను మేనేజర్‌గా ఉండలేను' అని చెప్పాడు. అంతేకాదు, ఇకపై నాకు హీరోయిన్‌గా అవకాశాలు రావని, కేవలం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానే మిగిలిపోతానని చాలామంది హెచ్చరించారు అని సుస్మితా చెప్పుకొచ్చింది. అయితే తనకు పరిశ్రమ నుంచి ఎలాంటి మద్దతు లభించనప్పటికీ, మాతృత్వమే తనను మరింత బలోపేతం చేసిందని సుస్మితా చెప్పారు. కూతురు వచ్చిన తర్వాతే నా కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ సినిమాలు ఇచ్చాను. రెనీని దత్తత తీసుకున్న తర్వాత 'ఆంఖే', 'మై హూ నా', 'మైనే ప్యార్ క్యూ కియా' వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించాను. ఇటీవలి కాలంలో 'ఆర్య' వెబ్ సిరీస్, 'తాలి' బయోపిక్‌లతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా తన నటనతో అలరించాను అంటూ సుస్మితా చెప్పుకొచ్చింది. ఇక సుస్మితా సేన్ జీవితంలో మాతృత్వానికి ఎప్పుడూ మొదటి స్థానమే ఉంటుంది.

# కరుప్పు..మొదటి హీరో విజయే




కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రాజకీయాల్లోకి వెళ్లేముందు ఆయన చివరి చిత్రంగా 'కరుప్పు' సినిమాను చేయాల్సిందని.. కానీ కొన్ని కారణాల వల్ల ఆయన ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోవడంతో, ఈ అవకాశం హీరో సూర్యను వరించిందని దర్శకుడు ఆర్జే బాలాజీ తెలిపాడు. విజయ్ రాజకీయాల్లోకి వచ్చే ముందు ఎలాంటి సినిమా చేయాలనే దానిపై తాము రెండు మూడు సార్లు సమావేశమై చర్చించామని బాలాజీ చెప్పారు. అయితే విజయ్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నా, ఆయన చెప్పిన కారణాలు సమంజసంగానే ఉన్నాయని, ఆయన నిర్ణయాన్ని తాను గౌరవించానని తెలిపారు. అంతేకాదు, కథా చర్చల సమయంలో విజయ్ అడిగిన సరైన ప్రశ్నలే స్క్రిప్ట్‌ను మరింత మెరుగు పరచడానికి సహాయపడ్డాయని, అందుకే సినిమా ప్రారంభ క్రెడిట్స్‌లో విజయ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపానని బాలాజీ పేర్కొన్నారు. ఆ తర్వాత నిర్మాతల కోరిక మేరకు ఈ కథను సూర్యకు వినిపించగా, ఆయనకు బాగా నచ్చి కొన్ని మార్పులు సూచించారు. అలా సూర్య హీరోగా 'కరుప్పు' సినిమా పట్టాలెక్కింది. తమిళ గ్రామదేవుడు 'కరుప్పసామి'.. అవినీతిపై పోరాడేందుకు ఒక లాయర్ అవతారంలోకి మారే ఫాంటసీ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కింది.



# నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేసిన ధనుష్ కర




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన లేటెస్ట్ హీస్ట్ థ్రిల్లర్ మూవీ 'కర' తాజాగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లలో విడుదలైనప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రేక్షకాదరణ పొందలేకపోయింది. మంచి అంచనాల మధ్య రిలీజ్ అయిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మాత్రం పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. ఇప్పుడు ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ నెట్‌ఫ్లిక్స్‌లో డిజిటల్ స్ట్రీమింగ్ జరుపుకుంటుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. అలాగే ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో కూడా స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో ఈ సినిమాను వీక్షించే అవకాశం దక్కింది.'కర' సినిమాలో ధనుష్ తనదైన స్టైల్‌లో ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. హీస్ట్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో సస్పెన్స్, యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌ను మిళితం చేస్తూ దర్శకుడు విఘ్నేష్ రాజా కథను రూపొందించారు. అయితే కథనం నెమ్మదిగా సాగడం, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను పూర్తిగా ఎంగేజ్ చేయలేకపోవడం వంటి కారణాలతో థియేటర్లలో ఈ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ చిత్రంలో 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు హీరోయిన్‌గా నటించింది. ధనుష్‌తో ఆమె కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే ప్రముఖ నటులు సూరజ్ వెంజరామూడు, కేఎస్ రవికుమార్, జయరామ్ కీలక పాత్రల్లో కనిపించారు. వీరి నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. ముఖ్యంగా థ్రిల్లింగ్ సన్నివేశాల్లో ఆయన సంగీతం సినిమాకు మరింత ఉత్కంఠను తీసుకువచ్చింది.

# చిన్న నిర్మాతలను పట్టించుకోవడం లేదు

## నిర్మాత ధీరజ్ మొగిలినేని ఆసక్తికర వ్యాఖ్యలు



టాలీవుడ్‌లో ఇటీవల నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య కొనసాగుతున్న 'పర్సంటేజ్ విధానం' వివాదం పెద్ద చర్చగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు స్టార్ నిర్మాతలు కలిసి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాజమండ్రిలో కలవడం ఇండస్ట్రీలో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ భేటీపై ఇప్పుడు నిర్మాత ధీరజ్ మొగిలినేని ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్, సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నాగవంశీ, ఫైన్ స్క్రీన్స్ సాహు గారపాటి, వృద్ధి సినిమాస్ వెంకట్ సతీశ్ కిలారు, ఎస్‌ఎల్వీ సినిమాస్ చెరుకూరి సుధాకర్ తదితర ప్రముఖ నిర్మాతలు పవన్ కళ్యాణ్‌తో సమావేశమయ్యారు. చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలు, ముఖ్యంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లలో 'పర్సంటేజ్ విధానం' అంశంపై చర్చించినట్లు సమాచారం.అయితే ఈ భేటీలో చిన్న, మీడియం రేంజ్ నిర్మాతలకు ప్రాతినిధ్యం లభించలేదని నిర్మాత ధీరజ్ మొగిలినేని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో జరిగిన 'సమ్మర్ హాలిడేస్' సినిమా టీజర్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ విషయంపై స్పందించారు.'మాకు కూడా చాలా సమస్యలు ఉన్నాయి. రూ.100 కోట్లకు పైగా బడ్జెట్‌తో సినిమాలు తీసే పెద్ద నిర్మాతల సమస్యలు వేరు.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656